# వాయిస్ టుడే

జనగాత్రం - మననేత్రం

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

Follow

పేజీలు 12

శుక్రవారం, 4 అక్టోబర్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## గిరిజన ప్రాంతాల్లో బైక్ అంబులెన్సులు: దామోదర్

**హైదరాబాద్:** "ఐటీడీఏల పరిధిలోని గిరిజనులు తమ నివాస ప్రాంతాల నుంచి అర గంటలోనే ఆసుపత్రికి చేరుకోవాలి. దీనికనుగుణంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి. అవసరమైన చోట బైక్ అంబులెన్స్‌లను ప్రారంభించండి" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

## ధాన్యం కొనుగోలుకు 7,139 కేంద్రాలు

### తొలుత నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో.. పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల్లో కొనుగోళ్లు

**హైదరాబాద్:** వానాకాలం వరి పంట కొనుగోలుకు రాష్ట్రవ్యాప్తంగా 7,139 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. తొలుత నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లోని కేంద్రాలకు ధాన్యం వస్తుందని పౌరసరఫరాల వర్గాలు చెబుతున్నాయి. మిగతా జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాల్లో ముందే వానాకాలం వరి సాగు కావడంతో కోతలు - 2వ పేజీలో




# మూసీని అడ్డుపెట్టుకుని ఎన్నాళ్లు గడుపుతారు?

## ముసుగు రాజకీయాలొద్దు.. కేటీఆర్, హరీశ్..

## ఫాంహౌస్‌లను కాపాడుకునేందుకే భారాస ఆందోళనలు

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారాస నాయకులు చెరువులు, నాలాలను ఆక్రమించి విధ్వంసం సృష్టించారు. హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటిని అందిస్తున్న జంట జలాశయాలను ఆక్రమించుకుని ఫాంహౌస్‌లు కట్టుకున్నారు. జన్వాడలో కేటీఆర్, అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావు, జంట జలాశయాలకు సమీపంలో సబితమ్మ తన కుమారుల పేర్లతో ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు. వాటిని కూల్చేస్తే అక్రమం అవుతుందా?" -సీఎం రేవంత్‌రెడ్డి

### ఆ పార్టీకి రూ.1500 కోట్లున్నాయి.. రూ.500 కోట్లు పేదలకు ఇవ్వొచ్చుగా..

### ఈటలా.. ప్రధాని వద్దకు వెళ్లి రూ.25 వేల కోట్లు అడుగుదాం పదండి

### 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలట్ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్

**హైదరాబాద్, కంటోన్మెంట్:** 'దోమలు, అనారోగ్యం, వరదల వంటి ఇబ్బందుల మధ్య.. మూసీలో నివసిస్తున్న ప్రజలు గౌరవంగా జీవించేందుకు రెండు పడక గదుల ఇళ్లు, తొవ్వ ఖర్చులకు రూ.పాతిక వేలు ఇస్తున్నాం. దీనిపై మూసీ ముసుగు కప్పుకొని రాజకీయాలు చేయకండి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను ఆక్ర మించి నిర్మించుకున్న తమ ఫాంహౌస్‌లను కాపాడుకు నేందుకే బావాబామరుదులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు కిరాయిమూకలతో ఆందోళనలు చేయిస్తున్నారు. వారికి సబితమ్మ వంత పాడుతోంది. వెనకున్న ? - మిగతా 2వ పేజీలో

# మంత్రిగారూ ఇదేం తీరు?



### అక్కినేని కుటుంబంపై మంత్రి సురేఖ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన సినీ పరిశ్రమ

### నాగార్జున ఫ్యామిలీ, సమంతకు చిరంజీవి, వెంకటేశ్, మహేశ్‌బాబు తదితరుల బాసట

### సమంతపై వ్యాఖ్యలనే సురేఖ వెనక్కు తీసుకోవడంపై రాంగోపాల్‌వర్మ అభ్యంతరం

### ఆమె అత్యంత జుగుప్సాకరంగా అవమానించింది నాగార్జున, నాగచైతన్యనంటూ పోస్ట్

### ఇంత జరుగుతున్నా స్పందించని సీఎం రేవంత్‌రెడ్డి

2వ పేజీలో

సమస్య సద్దుమణిగింది...

సంయమనం పాటించాలన్న టీపీసీసీ చీఫ్

కేటీఆర్‌కు వ్యతిరేకంగా మహిళా కాంగ్రెస్ ధర్నా..

### సమంతకు కొండా సురేఖ క్షమాపణలు



## ఫార్మా సిటీ భూములతో రియల్ దందా చేస్తావా..

### అనుయాయులకు 10వేల ఎకరాలు కట్టబెట్టాలని చూస్తున్నాడు

### డప్పూరు ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తాం: హరీశ్‌రావు

**సంగారెడ్డి:** ఫార్మాసిటీ కోసం హైదరాబాద్‌కు సమీపంలో సేకరించిన 15 వేల ఎకరాల భూములతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని, ఇందులో పది వేల ఎకరాలు తన అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి.. నువ్వు సీఎంవా, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌వా అంటూ హరీశ్ - మిగతా 2వ పేజీలో

## ఇళ్లు కూలిస్తే.. ప్రభుత్వం కూలుతుంది

### బుల్డోజర్లు దింపే అధికారం ప్రభుత్వానికి లేదు

### ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తాం.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్:** పేదవాళ్ల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చే ప్రయత్నం చేస్తే సహించే ప్రసక్తే లేదని, రాష్ట్ర ప్రభుత్వం కూలిపోక తప్పదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజలమీద ప్రతాపం చూపిస్తే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. పేదవాళ్ల ఇళ్లపై బుల్డోజర్లు దింపే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. సమగ్రమైన ఆలోచన లేకుండా అక్రమ కట్టడాల పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆందోళనలు, మనోవేదనను పరిగణనలోకి తీసుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గురువారం పార్టీనేతలు ప్రేమ్‌సింగ్




రాథోడ్, కాసం వెంకటేశ్వర్లు, ఎస్.కుమార్, ఎస్.ప్రకాశ్‌రెడ్డిలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమైనా పేదలకు మేలు చేసే ప్రయత్నంతోపాటు ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల బస్తీలపై కన్నేసి, ఆ ఇళ్లను కూల్చే పనికి శ్రీకారం చుట్టిందని, ఇలా దేశంలో ఎక్కడా ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరిట కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి, పేదల ఇళ్లపై మార్కింగ్ చేయడంతో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైందని, దాంతో వెనకడుగు వేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని 70 శాతం డ్రైనేజీ నీరంతా మూసీలో చేరుతోందని, ప్రతీగల్లీలో డ్రైనేజీ సమస్య నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించకుండా రూ.లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ పేరుతో అనాలోచిత చర్యలకు పాల్పడుతోందని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. 'అనేక చెరువుల్లో బడాబాబులు, పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యాపారవేత్తలు ఫామ్‌హౌస్‌లు, ఎస్టేట్‌ల పేరుతో నిర్మాణాలు చేసుకున్నారు. ముందు వారిపై హైడ్రా ప్రతాపం - మిగతా 2వ పేజీలో

## 'మేడిగడ్డ'పై వేగం పెంచిన విజిలెన్స్

### 5 నుంచి 11 వరకు తొమ్మిది మంది ఇంజినీర్ల విచారణ

**హైదరాబాద్:** మేడిగడ్డ బ్యారేజీ విచారణలో విజిలెన్స్ వేగం పెంచింది. ఈ నెల ఐదో తేదీ నుంచి విచారణకు రావాలని పలువురు సీనియర్ ఇంజినీర్లను పిలిచింది. పూర్తి నివేదికను త్వరగా అందజేయాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సూచించిన నేపథ్యంలో నీటిపారుదల శాఖలో కీలకమైన రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) ఇంజినీర్లను విచారించనుంది. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగడంపై విచారణ జరిపిన విజిలెన్స్ ఏడు అంశాలకు సంబంధించిన నివేదికను ఇప్పటికే అందజేసింది. మిగిలిన అంశాలపైనా విచారణ ముగించి, తుది నివేదికను జస్టిస్ ఘోష్ కమిషన్‌కు, ప్రభుత్వానికి అందజేయనుంది. ఇందులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీ పనులకు సంబంధించిన నిర్ణయాల్లో భాగంగా స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీలో ఉన్న మాజీ ఈఎన్సీ మురళీధర్, ఓఅండ్ఎం ఈఎన్సీ నాగేంద్రరావు, గతంలో సీడీవోలో ఉండి ప్రస్తుతం ఆదిలాబాద్ ప్రాజెక్టుల - 2వ పేజీలో

## దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా రా!

- మూసీ పరీవాహక ప్రాంతాలకు వెళ్దాం..
- శెభాష్ రేవంత్ అంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- బహిరంగ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తా: ఈటల



**హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3:** మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు కూలగొడుతున్న చోటకు సెక్యూరిటీ లేకుండా రావాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. శెభాష్ రేవంత్ రెడ్డి అని బాధితులు అంటే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో పాటు ముక్కు నేలకు రాస్తానన్నారు.

## సింగిల్ జడ్జి తీర్పుపై స్టేకు నిరాకరణ

- ముందస్తు చర్యలకు ఆదేశిస్తే.. ఇక్కడ ఆశ్రయించండి: హైకోర్టు
- స్పీకర్ కార్యదర్శికి స్వేచ్ఛ ఇచ్చిన సీజే ధర్మాసనం..
- 'అనర్హత' పిటిషన్ల కేసులో ప్రతివాదులకు నోటీసులు

**హైదరాబాద్:** ఎమ్మెల్యేల ఫిరాయింపుపై దాఖలైన అనర్హత పిటిషన్లలో సింగిల్ జడ్జి ఏదైనా ఆదేశాలు జారీ చేస్తే.. ఇక్కడ ఆశ్రయించొచ్చని స్పీకర్ కార్యదర్శికి సీజే ధర్మాసనం స్వేచ్ఛ ఇచ్చింది. ప్రతివాదుల వాదనలు వినకుండా సింగిల్ జడ్జి తీర్పును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. న్యాయ, చట్టసభ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్, కేంద్ర ఎన్నికల కమిషన్‌తోపాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, దానం నాగేందర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వివేకానంద్, వెంకట్ రావు, కడియం శ్రీహరిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను - మిగతా 2వ పేజీలో

## ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు

### ఇసుక అక్రమ రవాణా కట్టడిలో వైఫల్యం..

**హైదరాబాద్:** ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడంలో విఫలమైన పోలీసులపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. మల్టీజోన్-2 పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ఇందుకు బాధ్యులను గుర్తించి వారిపై వేటు వేశారు. ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలను వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో పెడుతూ జోన్ ఐజీపీ వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాలో సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్, తాండూరు టౌన్ ఇన్‌స్పెక్టర్లతోపాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్సైలు ఉన్నారు. సమగ్ర విచారణ అనంతరం ఈ వ్యవహారంలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉన్న వారిని గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్ర నిఘా వర్గాల నివేదికలు, విచారణల ఆధారంగా సీఐ, ఎస్సైలపై చర్యలు చేపట్టినట్లు ఐజీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. వీరే కాకుండా ఇంతకుముందు కూడా - మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 4 అక్టోబర్, 2024

# దేశానికంతటికీ వంట నూనెలు అందిస్తాం: తుమ్మల

## కేసీఆర్ కనిపించడం లేదని ఫిర్యాదు చేయాలి: సురేఖ



**గజ్వేల్:** దేశంలో వంట నూనెల దిగుమతికి ఏటా రూ.లక్ష కోట్లు ఖర్చవుతోందని, ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణను అగ్రగామిగా నిలిపి దేశానికంతటికీ నూనెలను సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమాల్లో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశారు. మిగిలిన రైతులకూ త్వరలో మాఫీ చేస్తాం. సిద్దిపేటలో రూ.300 కోట్లతో ఏర్పాటు చేస్తున్న పామాయిల్ పరిశ్రమలో వచ్చే సంవత్సరం నుంచి ప్రాసెస్ ప్రారంభిస్తాం' అని తెలిపారు. కొండా సురేఖ మాట్లాడుతూ.. 'ప్రజలకు మేము మంచి చేయాలని ఆలోచిస్తుంటే.. పక్కదారి పట్టించి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని కేటీఆర్ కుటిల యత్నాలు చేస్తున్నారు. ప్రతిపక్ష నేత, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ప్రజల్లో తిరగడం లేదు. ఆయన కనిపించడం లేదని పోలీసుస్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరుతున్నా' అని తెలిపారు.

# ఫార్మా సిటీ భూములతో రియల్ దందా చేస్తావా..

(మొదటి పేజీ తరువాయి)

నిలదీశారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, ఇప్పుడు ఫార్మా విలేజ్ పేరుతో డప్పూరుపై ఈ రాయి పడిందన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూరులో ఫార్మా విలేజ్ ఏర్పాటుతో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు మద్దతుగా జరిగిన రచ్చబండకు హరీశ్‌రావు హాజర య్యారు. ప్రభుత్వం సేకరిస్తున్న పంట పొలా లను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో ఫార్మా విలేజీ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిర్వాసితుల తరఫున న్యాయపోరాటం చేస్తామన్నారు. ఇందుకోసం గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు, హైకోర్టును కూడా ఆశ్రయి స్తామని చెప్పారు. వచ్చే అసెంబ్లీ సమా వేశాల్లో దీనిపై మాట్లాడతామని, మూడు పంట లు పండుతున్న ఈ భూముల్లో ఫార్మా పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని, బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నిస్తే బాధి తుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. మూసీని శుద్ధి చేస్తానని చెప్పి అక్కడి పేదల ఇళ్లు కూల్చి వేస్తున్న రేవంత్‌రెడ్డి.. డప్పూరు పచ్చని పంట పొలాల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేసి ఇక్కడి చెరువులు, కుంటలు, పక్కనే ఉన్న మంజీర నదిని విషంతో నింపుతావా అని హరీశ్‌రావు నిలదీశారు.

**రాహుల్.. రేవంత్‌కు బుద్ధి చెప్పు..**

'మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూలగొట్టుడు.. వారి భూములు కొల్ల గొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా 'అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇందిరమ్మ గరీబీ హఠావో అంటే.. రేవంత్‌రెడ్డి గరీబోంకో హఠావో చేస్తున్నారని మండిపడ్డారు. పేదల భూములు లాక్కోవొద్దని రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. హరీశ్ వెంట ఆ పార్టీ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపూరం శివకుమార్ ఉన్నారు.

# 'మేడిగడ్డ'పై వేగం పెంచిన విజిలెన్స్

(మొదటి పేజీ తరువాయి)

చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న శ్రీనివాస్, వర్క్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మ, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ అజ్మల్ ఖాన్‌లను ఈ నెల ఐదు, ఏడు, ఎనిమిది తేదీల్లో హాజరు కావాలని కోరింది. ఈ మేరకు గురువారం విజిలెన్స్ అదనపు ఎస్పీ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(పరిపాలన)కు లేఖ రాశారు. వీరితోపాటు మరో నలుగురిని ఈ నెల 9, 10, 11 తేదీలో విచారణకు పిలిచింది.

# ఇళ్లు కూలిస్తే.. ప్రభుత్వం కూలుతుంది

(మొదటి పేజీ తరువాయి)

చూపాలి. దమ్ముంటే అక్రమంగా నిర్మించుకున్న ఒవైసీ ఫాతిమా కాలేజీని కూల్చండి'అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**కొండా సురేఖ వ్యాఖ్యలపై..:** సురేఖ వ్యాఖ్యలపై విలేకరులు స్పందన కోరగా.. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం రాజకీయ ప్రయోజనాలు, ప్రత్యర్థులపై విమర్శల కోసం ఇతరుల కుటుంబ వ్యవహారాలు, మహిళల వ్యక్తిగత విషయాలను వాడుకోవడాన్ని ఖండిస్తు న్నామన్నారు. 'అలాంటి నీచ సంస్కృతిని కేసీఆర్ మొదలు పెట్టారు. కేటీఆర్ ముందుకు తీసుకెళ్లారు. నేడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనసాగిస్తున్నారు' అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న తప్పులకు ఆ పార్టీలను బహిష్కరించాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. 'కేసీఆర్ సర్కార్ గతంలో ఫోన్ ట్యాపింగ్‌తో సినీ ప్రముఖులు, వ్యాపారస్తుల వ్యక్తిగత విషయాలను తెలుసుకుని, వారిని బ్లాక్ మెయిల్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు అధికారులే చెప్పారు'అని వ్యాఖ్యానించారు.

# ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన ఒక సీఐతోపాటు అడవిదేవిపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూర్, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, బాజిరెడ్డిగూడెం, అచ్చంపేట, బొంరాస్‌పేట్, తాండూరు, చిన్నంబావి ఎస్సైలపై బదిలీ వేటు వేశారు. ఇసుక అక్రమ రవాణాలో వసూళ్లకు పాల్పడినట్లు తేలడంతో కొండమల్లేపల్లి హోంగార్డు, జడ్చర్ల హెడ్ కానిస్టేబుల్‌ను కూడా ఇప్పటికే డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కార్యాలయాలకు అటాచ్ చేశారు.

**వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్:** జోగిపేట ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన సమయంలో మైనర్ బాలికపై అత్యాచారం కేసులో అలసత్వం ప్రదర్శించడంతోపాటు దర్యాప్తులో అవకతకవలకు పాల్పడినట్లు తేలడంతో వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేస్తూ ఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

**మరికొన్నింటిపైనా నిఘా:** రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే బియ్యం అక్రమ రవాణాతోపాటు గాంబ్లింగ్, మట్కా లాంటి అక్రమ దందాలపైనా ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. వాటిపై అంతర్గత విచారణ ప్రారంభించారు.

# మంత్రిగారూ ఇదేం తీరు?

**హైదరాబాద్:** సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబంతోపాటు సినీనటి సమంతపై అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వివాదం ఇంకా సద్దుమణగలేదు. మంత్రి వ్యాఖ్యలను తప్పుబడుతూ చలనచిత్ర ప్రముఖులు గురువారం తీవ్రస్థాయిలో స్పందించారు. అక్కినేని కుటుంబంతోపాటు నటి సమంతకు బాసటగా నిలిచారు. మంత్రి తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకున్నారని, సినీ ప్రముఖులు దీనిని ఇంతటితో వదిలేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేసినా సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖుల విమర్శల వరద ఆగలేదు. తెలుగు సినీ పరిశ్రమతోపాటు ఇతర భాషల నటీనటులు కూడా స్పందించారు. మెగాస్టార్ చిరంజీవి, హీరోలు వెంకటేశ్, మహేశ్‌బాబు, రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ, నరేశ్, నాని, విజయ్ దేవరకొండతోపాటు సీనియర్ నటి విజయశాంతి, హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్, దర్శకులు రాజమౌళి, హరీశ్ శంకర్, తమిళ నటి కుష్బూ తదితరులు కూడా మంత్రి సురేఖ వ్యాఖ్యలను తప్పుపడుతూ 'ఎక్స్', ఇన్‌స్టాలో పోస్టులు పెట్టారు. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ సైతం మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు.

**సురేఖ వ్యాఖ్యల్ని తప్పుబడుతూ 'మా' లేఖ..**

సినీ పరిశ్రమకు చెందిన సభ్యుల వ్యక్తిగత జీవితాలతో ముడిపడి ఉన్న సున్నితమైన అంశాలపై ఎవరు మాట్లాడినా తగిన చర్యలకు ఉపక్రమిస్తామని తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్పష్టం చేసింది. తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు.. అసోసియేషన్ తరపున కొండా సురేఖ వ్యాఖ్యలను తప్పుపడుతూ అధికారికంగా సుదీర్ఘ లేఖ విడుదల చేశారు. మరోవైపు తన మాటలు సినీనటి సమంత మనోభావాలను దెబ్బతీశాయని తెలిసి ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ పోస్ట్ చేయడాన్ని ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తప్పుపట్టారు. 'కొండా సురేఖ కేవలం సమంతకి క్షమాపణ చెప్పడం ఏంటి.. అక్కడ అత్యంత జుగుప్సాకరంగా అవమానించింది నాగార్జునని, నాగ చైతన్యని' అని 'ఎక్స్'లో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

### స్పందించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల దుమారం రేగుతున్నా... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. నగరంలో జరిగిన డిజిటల్ కార్డులు సమావేశంలో మిగిలిన విషయాలు మాట్లాడినా ఈ వివాదంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం గమనార్హం.**

**ఆ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని సురేఖకు టీపీసీసీ చీఫ్ సూచన!**

మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో మరింత నష్టం జరగకుండా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నష్ట నివారణ చర్యలు చేపట్టారు. కొండా సురేఖతో మాట్లాడి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని ఆయన సూచించినట్లు సమాచారం. రాజకీయ విమర్శల్లో సినీ కుటుంబాన్ని, మహిళా నటిని కించపరిచేలా వ్యాఖ్యానించడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని.. అగ్ర నాయకత్వానికి సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందని ఆయన చెప్పినట్లు తెలిసింది. దీంతో సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు 'ఎక్స్' లో పోస్టు చేశారు.

'నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళలపట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమేగానీ గౌరవ నటి సమంత మనోభావాలను దెబ్బతీయడం కాదు. స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానం మాత్రమే కాదు, ఆదర్శం కూడా. నా వ్యాఖ్యలపట్ల మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైనట్లయితే బేషరతుగా నా వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నాను.. అన్యదా భావించవద్దు' అని పేర్కొన్నారు.

### నాగార్జున పరువునష్టం దావా..

సురేఖపై సినీనటుడు అక్కినేని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువునష్టం దావా వేశారు. సమంత, నాగచైతన్య విడాకులు తీసుకోవడంలో తన ప్రమే యం ఉందంటూ మంత్రి చేసిన వ్యాఖ్య లపై నాగా ర్జున కోర్టును ఆశ్రయించారు. తన కుటుంబ సభ్యుల పరువుకు మంత్రి భంగం కలి గించారని నాగార్జున పేర్కొన్నారు. ఆమెపై క్రిమి నల్ చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు కొండా సురేఖపై పలువురు బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు బం జారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేటీఆర్‌తోపాటు సినీ ప్రముఖు లపై చేసిన ఆరోప ణలకుగాను ఆమెపై కేసు పెట్టాలని కోరారు. కేటీ ఆర్‌పై ఆమె చేసిన వ్యాఖ్య లను వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### మూసీ మురికంతా వాళ్ల నోట్లోనే ఉందన్న కేటీఆర్

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనదైన శైలిలో స్పందించారు. 'మూసీ మురికి అంతా వాళ్ల నోట్లోనే ఉంది. ఇంకా శుద్ధి ఎందుకు.. లక్షన్నర కోట్లు ఖర్చు ఎందుకు?' అని ప్రశ్నించారు. కాగా, కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాంపల్లి వద్ద ధర్నా నిర్వహించారు.

### నటి రకుల్ ప్రీత్ సింగ్ సంచలన పోస్ట్

ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా(ఎక్స్) వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ఒక మహిళ గురించి మంత్రి హోదాలో ఉన్న మరో మహిళ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం.. నాకు ఏ రాజకీయ నాయకుడితో, కానీ ఏ రాజకీయ పార్టీతో కానీ ఎలాంటి సంబంధం లేదు.. రాజకీయ లబ్ధి కోసం పొలిటికల్‌గా నా పేరును వాడుకోవడం ఇప్పటికైనా ఆపాలి' అని నటి రకుల్ ప్రీత్ సింగ్ డిమాండ్ చేశారు.

# ఎన్నాళ్లు గడుపుతారు?

(మొదటి పేజీ తరువాయి)

కేవీపీ కూడా ఆమెను రక్షించలేరు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. సికింద్రాబాద్ హాకీ గ్రౌండ్స్‌లో గురువారం 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలట్ ప్రాజెక్టు సర్వేను ప్రారంభించిన సందర్భంగా.. ఆయన విపక్షాల తీరుపై మండిపడ్డారు. 'బావాబావమరుదులు మూసీని అడ్డుపెట్టుకుని ఎన్ని రోజులు గడుపుతారు? మీ భరతం పడతాం.. పేద ప్రజలపై అంత ప్రేమ ఉంటే.. భారాస ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయి.. రూ.500 కోట్లు పేదలకు ఇవ్వొచ్చు కదా. మూసీ నిర్వాసితులకు ఇంకా మేలైన పథకం ఉంటే సూచించండి. సచివా లయానికి రండి.. ఎన్ని రోజులైనా కూర్చుని చర్చిద్దాం. పేదలకు కొంత బాధ, నష్టం కలుగుతున్న మాట వాస్త వం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే మూసీ ప్రక్షాళన చేపట్టాం. అడ్డుకోవద్దు' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**బుల్డోజర్లు కొనేందుకు మా వద్ద డబ్బుల్లేవ్..**

మూసీ నిర్వాసితుల వద్దకు హరీశ్‌రావు, కేటీఆర్, ఈటల తదితర నాయకులు వెళ్లి కృత్రిమ ధర్నాలు చేస్తున్నారు. ముందు మాపై నుంచి బుల్డోజర్లు పంపించండంటు న్నారు. అన్ని బుల్డోజర్లు కొనేందుకు మా దగ్గర డబ్బుల్లేవు. ప్రజలకు నచ్చజెప్పి.. మెరుగైన పరిహారం అందిస్తాం. రాజకీయంగా నష్టమని తెలిసినా ముందుకు వెళ్తున్నామంటే.. హైదరాబాద్ ప్రజల భవిష్యత్తు కోసం మాత్రమే. కేటీఆర్, హరీశ్‌లకు జిరాక్స్‌లా ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారు. ఈటలా.. మీకు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో కలిసి రండి. మీరు ముగ్గురూ ముందుండి ఢిల్లీకి నడిపించండి. మేం వెనకే ఉంటాం. జవహర్ నగర్‌లో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. నిర్వాసితులకు 150 గజాల చొప్పున ఇద్దాం. ఇళ్లు కట్టేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.25 వేల కోట్లు అడుగుదాం పదండి. మోదీని అడిగేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు.

**ఫ్యామిలీ డిజిటల్ కార్డుతోనే అన్నీ..**

ఒకే రాష్ట్రం, ఒకే కార్డు అన్న నినాదంతో ఫ్యామిలీ డిజి టల్ కార్డును రూపొందిస్తున్నాం. రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యా ణలక్ష్మి, షాదీముబారక్, పింఛను, ఫీజు రీయింబర్స్ మెంట్.. ఇలా అన్నిటికీ ఈ కార్డు ఉపయోగపడుతుంది. వారసత్వ హక్కులు, ఆస్తుల బదిలీలు, విరాసత్‌లు, పాస్‌పోర్టు దరఖాస్తులు ఇలా అన్నీ సులభంగా పరిష్కారమవుతాయి. రాష్ట్రంలోని 238 యూనిట్ల పరిధుల్లో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు పైలట్ ప్రాజెక్టు సర్వే నిర్వహిస్తారు' అని సీఎం వివరించారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మూసీ నిర్వాసితులకు ప్రస్తుతం కేటాయించిన 15 వేల ఇళ్లకు అదనంగా మరో నాలుగైదు వేల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

నిర్వాసితుల విషయంలో సోషల్‌మీడియా, య్యూటూబ్ ఛానెళ్లలో కేటీఆర్ విష ప్రచారం చేయిస్తున్నారని, దీన్ని ఇప్పటికే ప్రజలు గ్రహించారని అన్నారు. పేదలకు 1.33 లక్షల రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామన్న భారాస ప్రభుత్వం.. 67 వేల ఇళ్లు మాత్రమే నిర్మించిందని, మిగిలిన ఇళ్లను పూర్తిచేసి దసరాలోపు లబ్ధిదారులకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గానికి ఒక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నియోజకవర్గంలోని వాహెబ్‌నగర్‌లో 900 కుటుంబాలు, కారా?నాలోని 600 కుటుంబాలను సర్వేకు అధికారులు ఎంపిక చేయగా.. వారిలో ఐదుగురిని సీఎం రేవంత్‌రెడ్డి వేదికపైకి పిలిచారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ భార్య వర్షశ్రీతోపాటు స్థానిక మహిళలు శారద, రాజేశ్వరి, సుల్తానా బేగం, బొబ్బిలి అన్నపూర్ణమ్మలకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఫారాలను అందజేశారు.

# సన్నాల్లో గోల్‌మాల్ జరిగితే కలెక్టర్లే బాధ్యులు

- **సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఈ సీజన్ నుంచే..**
- **ప్రతీరోజు కలెక్టర్లు రెండు గంటలపాటు ధాన్యం సేకరణపై దృష్టి పెట్టాలి**
- **జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్:** రైతులకు ఇచ్చిన మాట ప్రకా రం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు కనీస మద్దతు ధరకు(ఎంఎస్‌పీ) అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి తప్పు జరగ కుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని హెచ్చరించారు. సన్న వడ్ల కొనుగోలుకు ప్రత్యే క ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్ట ర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించా రు. ధాన్యం సేకరణ, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, టీచర్ల నియామక ప్రక్రియను దసరా లోపు పూర్తి చేసే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యకార్యదర్శులు వెంకటేశం, రఘునందన్‌రావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్,చౌహాన్ జిల్లాల నుంచి మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ప్రతీ కేంద్రానికి ఓ నంబర్..:** ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఒక నంబర్ కేటాయించాలని, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నంబర్ తప్పకుండా వేయాలని సీఎం సూచించారు. దీంతో ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్‌మాల్ జరిగినా సులభంగా తెలుసుకునే వీలుంటుందన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని మార్గాల్లోనూ నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు

**రైతులను వేధించొద్దు...:** తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని సహించొద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం చెప్పారు. రైతులు ఎక్కడ కూడా దోపిడీకి గురి కాకూడదని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

# సింగిల్ జడ్జి తీర్పుపై స్టేకు నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 24కు వాయిదా వేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నాలుగు వారాలకు గడువిస్తున్నామని.. ఆ లోగా వివరాలు అందజేయకుంటే మేమే ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని గత నెల 9న స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. సింగిల్ జడ్జి తీర్పులో ఇచ్చిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టును ఆశ్రయించారు. 'స్పీకర్ అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని కిహోటో హాలోహాన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సింగిల్ జడ్జి తీర్పు దీనికి విరుద్ధంగా ఉంది. మణిపూర్ శాసనసభ స్పీకర్ కీషమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై సింగిల్ జడ్జి ఆధారపడ్డారు. స్పీకర్ ఐదేళ్లపాటు మౌనంగా ఉండేందుకు ఇష్టపడితే కోర్టులు చూస్తూ ఉండలేవని చెప్పారు. బీఆర్ఎస్ కాలంలో అనేక అనర్హత పిటిషన్లు పదవీకాలం ముగిసే వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. పిటిషనర్లు స్పీకర్‌ను ఊపిరి తీసుకునే అవకాశమైనా ఇవ్వకుండా కోర్టును ఆశ్రయించారు'అని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయ సమీక్ష అధికారాలతో అనర్హత పిటిషన్‌లను నిర్ణీత గడువులోగా నిర్ణయించాలని శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయగలదో.. లేదో తేల్చాలని కోరారు. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన గడువు సమీపిస్తోందని, ఏదైనా నిర్ణయం వెలువరించే అవకాశముందని చెప్పారు. సింగిల్ జడ్జి సుమోటోగా విచారణ చేపట్టకున్నా.. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి ఆదేశాలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఒకవేళ ఏదైనా ఉత్తర్వులు ఇస్తే వెంటనే ఇక్కడ (సీజే ధర్మాసనం) ఆశ్రయించే స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. దీనికి అనుమతించిన ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

**సింగిల్ జడ్జి తీర్పు ఇది...**

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావును అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద్, దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిం చాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా, స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ బీజేపీ ఎల్పీ మహేశ్వర్‌రెడ్డి వేర్వే రు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. ఎమ్మెల్యేల ఫిరాయింపుపై దాఖలైన అనర్హత పిటిషన్ల స్టేటస్ చెప్పేందుకు 4 వారాలకు గడువిస్తు న్నాం.. ఆలోగా వివరాలు అందజేయకుంటే మేమే ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని గత నెల 9న స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు తేల్చి చెప్పింది.

# ధాన్యం కొనుగోలుకు 7,139 కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

కూడా ముందే మొదలుకానున్నాయి. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లకు 4,496 పీఏసీఎస్ కేంద్రాలు, 2,102 ఐకేపీ సెంటర్లు, 541 ఇతర కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అక్టోబరు 1 నుంచి కేంద్రా లను ఏర్పాటు చేయాలని ముందు అనుకున్నప్పటికీ రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలతో వరి కోతలు ఆలస్యమ య్యాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో కొన్ని కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

### పైలెట్ ప్రాజెక్టుగా ఆదిభట్లలో
### తర్వాత నియోజకవర్గం అంతటా
### ప్రజలు అధికారులకు సహకరించాలి
### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: అక్టోబర్ 3 (వాయిస్ టుడే) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో, గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పాల్గొని మున్సిపాలిటీ 9వ వార్డులో సర్వే నిర్వహించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీలు ఉండగా, పైలెట్ ప్రాజెక్టుగా ఆదిభట్ల మున్సిపాలిటీ ఎంచుకోవడం జరిగింది. ఫ్యామిలీ డిజిటల్ కార్డును మున్సిపాలిటీలోని 9వ వార్డులో ఎమ్మెల్యే, చైర్మన్, కమిషనర్ కలిసి ఇంటి యజమానురాలైన మహిళ వద్ద కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి ఫ్యామిలీ కార్డును ప్రారంభించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు బాధ్యులుగా వ్యవహరిస్తూ మీ ఇంటి దగ్గరకు వచ్చిన అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ డిజిటల్ కార్డుతో రేషన్ కార్డు, హెల్త్ కార్డు, ప్రభుత్వ పథకాలు అందాలన్నా, ఇలా ఈ విధంగా ఎన్నో ఉపయోగాలకు ఈ ఒక్క కార్డు సూచికగా ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వం ఎన్నో చెప్పి ఏమి కూడా చేయలేదని ఒక రేషన్ కార్డు, ఒక పింఛన్ కూడా ఇవ్వలేదని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం, రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని, అందుకొరకే ఇంటి యజమానిగా మహిళలను గుర్తిస్తూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, దీన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. తప్పని పరిస్థితి ఉంటే తప్ప, ప్రతి ఒక్కరు ఈ యొక్క కార్డులో ఫ్యామిలీ ఫోటో దిగేలా కుటుంబ సభ్యులు చూసుకోవాలని తెలిపారు. ఈ ఒక్క కార్డు అన్నిటికీ ప్రామాణికంగా ఉంటుందని కనుక ఈ యొక్క అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకంగా ఆదిభట్ల మున్సిపాలిటీ ప్రజలకు తెలిపారు. హడావుడి లేకుండా అధికారులు సమన్వయం పాటించి, ప్రజలకు ఈ యొక్క ఫ్యామిలీ డిజిటల్ కార్డు గురించి వివరిస్తూ, వాళ్ల యొక్క కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని, ఎక్కడ కూడా పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి ఆ తర్వాతే డేటా ఎంట్రీ చేయాలని అధికారులను హెచ్చరించారు.

"రేషన్ కార్డు లేని వాళ్లకు త్వరలోనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని, ఎవరైనా పిల్లలను ఆడ్ చేసేది ఉన్న అప్పుడే చేసుకోవచ్చు అని, తర్వాత కూడా ఫ్యామిలీ కార్డ్ ఇవ్వడం జరుగుతుంది. ఈ యొక్క కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు".

మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలో నుంచి వచ్చిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు, పైలెట్ ప్రాజెక్టుగా మన నియోజకవర్గంలోని మన మున్సిపాలిటీలో ప్రారంభించడం సంతోషంగా ఉందని, ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమం ఎమ్మెల్యే చొరవతో మున్సిపాలిటీలో ప్రారంభించడం వలన, ఫ్యామిలీ డిజిటల్ కార్డు ముందుగా మన మున్సిపాలిటీ ప్రజలకు రావడం జరుగుతుందని, దీని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యుల ఫోటో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని దీనిలో ఎవరికి కూడా ఎలాంటి అనుమానాలకు, అపోహలకు పోకుండా, మీరు మీ యొక్క కుటుంబ సభ్యులు ఈ ఫోటోలో ఉండేలా చూసుకోవాలని, ఈ యొక్క కార్డు ఆరోగ్య, బీమా, రేషన్ కార్డ్, ప్రభుత్వ పథకాలకు అనుగుణంగా ఉంటుందని మరొకసారి తెలిపాను. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసీ శేఖర్ మామ, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, కొత్త కురుమ శివకుమార్, రాచర్ల వెంకటేశ్వర్లు, పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కి కృషి చేస్తా

### :- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ లోని సిరి గార్డెన్ లో కాప్రా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి టి జి ఐ సి సి టీచైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై నూతన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలుతెలిపారు. ఇండస్ట్రియల్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు,పావని రెడ్డి, టి ఐ ఎఫ్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి, గోపాల్ రావు నాలాకమిషనర్ ప్రభాకర్,స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నూతన అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు మచ్చ అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, దామోదర్ చారి కమిటీ సభ్యులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ పాల్గొన్నారు.



## బోడుప్పల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు ఇవ్వండి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బోడుప్పల్ మేయర్ వినతి..!

వాయిస్ టుడే న్యూస్,అక్టోబర్ 03 బోడుప్పల్ : బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. ఈ మేరకు గురువారం నాడు ముఖ్యమంత్రి నివాసంలో శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి,టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డిలతో కలిసి బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కావాల్సిన నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. బోడుప్పల్ కార్పొరేషన్ లో ప్రధాన సమస్యలైన ఎస్ఎన్డిపీ ప్రాజెక్టును పూర్తి చేసి ముంపు ప్రాంతాల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అదే విధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దళితులకు చెందిన అసైండ్ భూములకు పరిష్కారం చూపి వారికి న్యాయం చేసేలా చొరవ చూపాలని కోరినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా బోడుప్పల్ పది వేల కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన వక్ఫ్ భూమి సమస్యకు పరిష్కారం చూపి అక్కడి ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.



## దుర్గామాత అమ్మవారి ఆశీస్సులు ప్రజల అందరిపై ఉండాలి

### ఘట్కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి

వాయిస్ టుడే న్యూస్, అక్టోబర్ 03 ఘట్కేసర్: మేడ్చల్ నియోజకవర్గం ఔషపురం గ్రామంలో దేవి శరన్నవరాత్రులు సందర్భంగా గ్రామంలో ప్రతిష్టాపించిన అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు ఘట్కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ దుర్గా మాత అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి అని అదేవిధంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో హాయిగా జీవించాలని ఆ అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగిందని తెలిపారు.

## వాస్తవాలు తెలుసుకొని మాట్లాడడం అలవాటు చేసుకోవడం మంచిది

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి, అక్టోబర్ 3(వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం నల్లచెరువు, సున్నం చెరువు మీద ఇచ్చిన స్టేట్మెంట్ పై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందిస్తూ సున్నం చెరువు వద్ద అక్రమ కట్టడాలు కూల్చిన పరిధి కూకట్ పల్లి నియోజకవర్గం లోకి రాదని, అది శేర్లింగంపల్లి నియోజకవర్గానికి చెందుతుందని గ్రహించాలన్నారు. కూకట్ పల్లిలోని అన్ని చెరువలు మీద విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోమని 2018 లోనే మొట్టమొదటిగా చెప్పింది నేనే అన్నారు. అందుకనే సమాచార హక్కు చట్టం ద్వారా కూకట్ పల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాలని, గతంలో చెరువుల పరిస్థితి ఏమిటి? ఎవరి హయాంలో ఎంత వరకు ఆక్రమణలకు గురైందన్న వివరాలు కోరామని తెలిపారు. ముఖ్యంగా మీ చుట్టూ ఉన్న అధికారులు మిమ్మల్ని తప్పు దోవ పట్టిస్తున్నారని, దయచేసి మీకున్న గౌరవాన్ని కాపాడుకుంటారని, యదార్థాలు తెలుసుకోవాలని కోరారు. దాదాపు 30 నుండి 40 సంవత్సరాల నుంచి ఉంటున్న నిరుపేదలు ఇందులో సమిధులవుతున్నారని, వారికి అన్యాయం జరగకుండా మీరు పూర్తి వివరాలు సేకరించి చెరువులను కాపాడాలని కోరారు. నిరుపేదలకు మేము ఎప్పుడూ అండగా ఉంటూ వారికి ఏదైనా సమస్య ఉన్నా న్యాయపరంగానే ఎదుర్కొంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## టి.డబ్ల్యూ. జె.ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామ చేసిన జర్నలిస్ట్ కళ్యాణ్. సి.ఎమ్



కూకట్‌పల్లి, అక్టోబర్ 3(వాయిస్ టుడే) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పదవికి జర్నలిస్ట్ మండపాక కళ్యాణ్ చక్రవర్తి గురువారం రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక టీయూడబ్ల్యూజే (143) నందు సుదీర్ఘకాలం పనిచేసి జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేశారు. జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో మేలు జరగడంలేదని భావించి నాడు రాజీనామా చేశారు. ఆ తర్వాత తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆయనను గుర్తించి యూనియన్ లోకి ఆహ్వానించారు. జర్నలిస్టులకు మేలు చేసే క్రమంలో ఆ యూనియన్ తో కలిసి పని చేయడానికి ముందుకు నడిచారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏర్పాటులో కీలక పాత్ర వహించారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నందు ప్రధాన కార్యదర్శి పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆ తర్వాత మేడ్చల్ జిల్లా లో ట్రెజరర్ గా పని చేశారు, ఆ తర్వాత జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రెండో మహాసభల్లో ఆయన కార్యదర్శి పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయన్ని వరించిన ప్రతి పదవికి వన్నె తెచ్చే విధంగా ముందుకు నడిచారు, జర్నలిస్టుల సంక్షేమం పరమావధిగా పనిచేశారు. కరోనా సమయంలో తోటి జర్నలిస్టులతో కలిసి కూకట్ పల్లి నియోజకవర్గం నందు కరోనాతో అనేక ఇబ్బంది పడ్డ జర్నలిస్టులకు యూనియన్లకు అతీతంగా పలు రకాలుగా సహాయపడ్డారు. నిత్యం జర్నలిస్టులకు పూర్తి ఫలితాలు క్రింది స్థాయి వరకు అందాలని ఆయన ఆకాంక్ష కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామా చేయడం ఆసక్తికరంగా మారింది. త్వరలో భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తానని మీడియాకు తెలిపారు.

## తెలంగాణ ఇంటలిజెన్స్ విభాగం అధిపతి శివదర్ రెడ్డిని కలిసిన బి.వెంకటేశ్వర్లు



కూకట్‌పల్లి, అక్టోబర్ 3(వాయిస్ టుడే) తెలంగాణా ఇంటలిజెన్స్ విభాగం అధిపతి బి. శివదర్ రెడ్డి ఐపీఎస్ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్)నీ గురువారం ఆయన కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణా ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా ఏర్పాట్లు

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ శశాంక



రంగారెడ్డిజిల్లా/ఇబ్రహీంపట్నం: అక్టోబర్ 3 (వాయిస్ టుడే) ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కార్యాలయంలో కలెక్టర్ శశాంక ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో పండించిన ధాన్యం కొనుగోలు చేయుటకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. రైతులు ధాన్యం తీసుకు వచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సన్నరకం వరి, ముతక రకాలను వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వేరు చేయాలని, సన్నారకం వరి, ముతక రకం వరిని వేర్వేరుగా ట్యాగ్ చేయబడిన రైస్ మిల్లులకు జారీ చేసిన కేటాయింపు ఆధారంగా డేటా ఎంట్రీని రోజువారీ ప్రాతిపదికన చేయాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్ లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, ధాన్యం నిల్వలు తరలించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సన్నరకం, ముతక రకానికి సంబంధించి సంబంధిత అధికారులకు అవసరమైన ధృవీకరణ కోసం అవసరమైన శిక్షణ ఇవ్వబడుతుందని అన్నారు. టార్పాలిన్‌లు, ప్యాడీ క్లీనర్‌లు, తూనికలు, పొట్టు రిమూవర్, తేమ యంత్రం, వంటి అన్ని మౌలిక సదుపాయాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీ.ఎం గోపీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింగ్ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, డీసీఓ సుధాకర్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## నియోజకవర్గం పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### పీఏసీ చైర్మన్ , ఎమ్మెల్యే ఆరికెపూడి



శేరిలింగంపల్లి, అక్టోబర్ 3(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ శుక్రవారం పీఏసీ చైర్మన్ , ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మరియు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి రూ. 75 లక్షల 50 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా హెచ్ఎంటి హిల్స్ లో రూ. 25.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రాం నరేష్ నగర్ రోడ్డు నంబర్ 2 లో రూ.24.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రాం నరేష్ నగర్ రోడ్డు నంబర్ 13 లో రూ.25.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణలతో పాటు వివిధ పనులకు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హైదర్ నగర్ డివిజన్ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు తప్పకుండా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# ఒక కుటుంబం ఒక కార్డు లక్ష్యంగా డిజిటల్ కార్డుల అందజేత



## బాలాజీనగర్ డివిజన్‌లో సమస్యల పై పరిశీలించిన హెచ్ఎండబ్ల్యూస్ & ఎస్బి ఎండి అశోక్ రెడ్డి, పగడాల బాబురావు

కూకట్ పల్లి : అక్టోబర్ 3(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కెపీహెచ్బి 15త్ ఫేస్ లోని డ్రైనేజీ సమస్యల గురించి హెచ్ఎండబ్ల్యూస్ & ఎస్బి ఎండి అశోక్ రెడ్డి దృష్టికి మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు తీసుకు వెళ్లడం తో ఎండి అధికారులతో సమస్య గల ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం ప్రభాకర్, డిజిఎం శిరీష, మేనేజర్ సలోమి,వినయ్ స్థానికులు జీవ, సత్యనారాయణ, కృష్ణా నాయక్, భాస్కర్ రావు, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గురువన్నపేట బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– జనగామ నియోజకవర్గం కొమురవెల్లి మండలం గురువన్న పేట గ్రామంలో మైనర్ బాలిక పై జరిగిన అత్యాచార కేసుకు సంబంధించిన బాధిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ,రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం, పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ముందుగా సిద్ధిపేట పోలీస్ కమిషనర్ ను కలసి దీనికి కారణమైన నిందితుడిని చట్టం ప్రకారం కఠినంగా శిక్షిచాలన్నారు. అదేవిధంగా బాధ ఆవేశం తో ఇంటివద్ద ఉద్రిక్తత నెలకొన్న సందర్భంలో బాలికకు సంబంధించిన పలువురు కుటుంబ సభ్యులు గ్రామస్తులపైన కేసు నమోదును వెనక్కి తీసుకోవాలని సీపికి తెలపారు.



## బిరప్ప కామరతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– కుక్కునూరు పల్లి గ్రామంలో బిరప్ప కామరతి నూతన ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రోజున బీబీనగర్ మండలంలోని మహాదేవ్ పూర్ గ్రామములో జరుగుతున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యామిలీ డేటా బెస్ ఆధారంగా అధికారులు నిర్వహిస్తున్న సర్వే తీరును కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, నమోదు కానీ పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సక్రమంగా సేకరించాలని అన్నారు. నిర్ణీత సమయం లోపు పైలెట్ సర్వే ను పూర్తి చేయాలని , ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా డిజిటల్ సర్వే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల తహసిల్దార్ శ్రీధర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, పంచాయతీ సెక్రెటరీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

## పైలెట్ ప్రాజెక్ట్ సర్వే ను దేశాయిపేటలో ప్రారంభించిన మంత్రి....

## కుటుంబాల సమగ్ర సమాచారంతో కార్డు రూపకల్పన చేయనున్నట్లు వెల్లడి....



వరంగల్ ( వాయిస్ టుడే )అక్టోబర్ 03: ఒక కుటుంబం ఒక కార్డు లక్ష్యం గా డిజిటల్ కార్డులను రాష్ట్ర ప్రజలందరికి అందజేయనున్నట్లు రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం వరంగల్ నగర పరిధి 12 వ డివిజన్ దేశాయి పేట లో మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యం లో రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ గా చేపడుతున్న డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను మంత్రి అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భం గా బల్దియా కమీషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశం లో మంత్రి ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు.

కార్యక్రమం లో మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేసే కార్యక్రమంలో ప్రభుత్వం ముందుకు వెళు తుందని అందులో భాగంగా 200 వందల యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ తో పాటు 500 లకే గ్యాస్ సిలిండర్లను అందజేయడం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5 నుండి 10 లక్షల పెంచడం రైతులకు రుణమాఫీ చేయడం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించే క్రమంలో రేషన్ కార్డుల కోసం ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించడం జరుగుతుందనీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యామిలీ యూనిట్ గా కుటుంబలకు కార్డు అందజేయాలని సంకల్పించి సంబంధిత కుటుంబం యొక్క డేటా అంత ఆ కార్డులో నిక్షిప్తమై ఉండేలా, దేశస్థాయిలో ఆధార్ కార్డు కు ఎంతటి ప్రాముఖ్యం ఉందో అదే స్థాయిలో ఫ్యామిలీ కార్డు ఎక్కడి నుండైనా పని చేసేలా ఈ కార్డు ను రూపొందించడం జరుగుతుందని ఆమె అన్నారు.

ఇట్టి కార్డును నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా సర్వే ప్రారంభించడం జరుగుతున్నదని అందుకుగాను వరంగల్ లో రెండు డివిజన్లను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని దేశాయిపేటలో ప్రారంభించడం జరిగిందని, మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్తగా కుటుంబంలో చేరిన వారి పేర్లను నమోదు చేయడం, ఉమ్మడి కుటుంబంలో వివాహాలు జరిగిన వారికి కుటుంబాల వారిగా కార్డులను అందజేయడం జరుగుతుందని, ప్రస్తుతం అందజేసే డిజిటల్ కార్డులో మహిళలను కుటుంబ యజమానిగా పేర్కోనడం జరుగుతుందని, గత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సూచించినట్లుగా మహిళలకు భరోసా అందించడానికి వారిని యజమానులుగా పేర్కొనడం జరుగుతుందని, అదే పంథా ను ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

ప్రభుత్వ ఆదేశం మేరకు ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్ట్ లో భాగం గా సర్వే చేపట్టడానికి జిల్లా కలెక్టర్ ఉద్యోగులు సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తారని ఇందులో ఏమైనా లోపాలు ఉంటే గుర్తించి సరిచేయడానికి పైలెట్ ప్రాజెక్ట్ కింద తీసుకోవడం జరిగిందని, పైలెట్ ప్రాజెక్ట్ సర్వే నిర్వహణకు డివిజన్ నుండి డేటా పంపించిన క్రమం లో 150 గృహాలను సర్వే చేయడానికి ప్రభుత్వం నుండి ఆమోదం లభించిందని పైలెట్ ప్రాజెక్ట్ అనంతరం అన్ని గృహాల్లో సర్వే నిర్వహించి డిజిటల్ ఫ్యామిలీ కార్డులు అందరికి ఇప్పిస్తామని, ప్రజల వద్దకు వచ్చే మధ్య దళారులను నమ్మవద్దని, సర్వే నిర్వహణ కార్డుల అందజేత నిష్పక్షపాతంగా పారదర్శకం గా జరుగుతుందని ఇట్టి అద్భుతమైన ప్రాజెక్టుకు రూపు కల్పన చేసిన ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని, వాటికి నిరుపేదలకు అందేలా చూస్తామని, డబుల్ బెడ్ రూమ్ లకు మరమత్తులు చేసి నిరుపేదలకు అందజేస్తామని, తప్పుడు హామీలు ఇచ్చే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, విద్య వైద్యం అభివృద్ధి సంక్షేమమే ఎజెండా గా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు.

నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిజిటల్ ఫ్యామిలీ కార్డులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం సంతోషదాయకమని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ. 500 కే సిలిండర్ ను అందజేయడం జరుగుతుందని వ్యక్తిగత ఆధార్ కార్డు మాదిరిగా కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ కార్డు అందజేయడం అందులో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయడం తో పాటు వ్యక్తిగత కార్డు లు కూడా పొందవచ్చని వరంగల్ (తూర్పు)నియోజక వర్గం లో 12, 38 డివిజన్ లను పైలెట్ గా ఎంపిక చేసి సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ దారిద్ర్య రేఖ కు దిగువ (బిపిఎల్) దారిద్ర్య రేఖ కు ఎగువ (ఏపిఎల్) తో సంబంధం లేకుండా ఒక కుటుంబానికి ఒక గుర్తింపు కార్డు అందజేయడానికి పైలెట్ గా 12వ డివిజన్ ను ఎంచుకోవడం జరిగిందని ఈనెల 3 నుండి 7 వరకు సర్వే కొనసాగుతుందని, ఇక్కడ సుమారుగా 3 వేల కుటుంబాలు ఉన్నాయని అందులో నుండి 150 ఎంపిక చేసి సర్వే నిర్వహించడం జరుగుతుందని , ఇందులో మరణించిన వారు ఉంటే వారి సమాచారాన్ని తొలగించడం కొత్తగా ఎవరైనా చేరితే సమాచారాన్ని నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఇంటింటి సర్వేలో పాల్గొని మంత్రి కొండ సురేఖ, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ, డిజిటల్ కార్డు పై నగర ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, డిప్యూటీ కమిషనర్ కృష్ణా రెడ్డి, కార్పొరేటర్లు కావేటి కవిత, బస్వరాజు కుమారస్వామి, సురేష్ జోషి, ఫురా?న్ టి పి ఆర్ ఓ కోలా రాజేష్ కుమార్ తహసీల్దార్ ఇక్బాల్ టి ఎం సి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ సర్వే ప్రారంభం

### భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– గురువారం రోజు భువనగిరి పట్టణంలో ని స్థానిక అర్బన్ కలని లో రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన డిజిటల్ సర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు అధికారులు ఇంటిటికి వెళ్లి సర్వే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ వార్డ్ అధ్యక్షులు పాస్తుపుల సాయి కిరణ్ పాల్గోన్నారు.



## భీమరి గూడెం గ్రామానికి వెళ్లే మార్గంలో గంధమల్ల చెరువు కు వెళ్లే కాల్వవల్ల రాకపోకల పరిష్కారం చేస్తా

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– తుర్కపల్లి మండలం భీమరి గూడెం గ్రామానికి వెళ్లే మార్గంలో గంధమల్ల చెరువు కు వెళ్లే కాల్వవల్ల రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయని సమాచారం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆ కాల్వను సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చేస్తానని, సంబంధిత అధికారులతో మాట్లాడి కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పీర్లపల్లి గ్రామ శివారులో ఉన్న మల్లన్న సాగర్ నుండి వచ్చే నీటి కెనాల్ ని సందర్శించారు. ఆ తర్వాత సంగ్య తండా నుండి వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న తోక చెరువులోకి నీటిని పంపించేందుకు జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్,ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా ఈర్ల రాజు



వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 03: బీసీ యువజన సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శిగా నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి గ్రామానికి చెందిన ఈర్ల రాజు ను నియమిస్తున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నని నన్ను గుర్తించి యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా నియమించిన డ్యాగల శ్రీనివాస్ కు తన కృతజ్ఞతలు తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నీల సుధాకర్, దుగ్గొండి మండల నాయకులు కొలిపాక సుధాకర్, కోల అజయ్, రాజేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం

### వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్న గౌడ్

తొర్రూరు, అక్టోబర్ 3 వాయిస్ టుడే : తొర్రూరు మండలం వెంకటాపురం గ్రామములో తెలంగాణ సాంప్రదాయాలు సంస్కృతిని భావితరాలకు తెలియజేసేలా వెంకటాపురం సేవా ట్రస్ట్ కు ప్రతినెల దాతలు అందిస్తున్న సహకారంతో వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్నగౌడ్ ఆధ్వర్యంలో ఎంగిలి పూల–(మొదటి రోజు) బతుకమ్మ పండుగ రోజున ఉత్తమ బతుకమ్మలుగా గెలుపొందిన మహిళలు బొలగాని సోమలక్ష్మి, పుప్పాల మంగమ్మ, మద్దెల సుశీలకు నగదు బహుమతులు కొండ యాకన్న గౌడ్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కొండ యాకన్నగౌడ్, మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వెంకటాపురము గ్రామములో సేవా ట్రస్ట్ ద్వార బతుకమ్మ పోటీలు నిర్వహించడం జరుగుతుందని మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఆడుతూ, పాడుతూ., బతుకమ్మల చుట్టు చిన్న, పెద్ద తేడా లేకుండ నృత్యం చేస్తూ సంబరాలు చేశారు. వెంకటాపురము గ్రామము లో దాతల సహకారంతో ఎన్నో సంవత్సరములుగా సేవా కార్యక్రమాలు ట్రస్టు ద్వార చేయడం జరిగిందని. ప్రతి ఒక్కరూ సేవా భావంతో దాతలుగా ముందుకు వచ్చి మరెన్నో కార్యక్రమాలు చేయాలని కోరడం జరిగింది. సేవా ట్రస్ట్ కు ప్రతినెల దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలు ఎల్లప్పుడు కొనసాగాలని కోరుకుంటూ. గ్రామ ప్రజల తరఫున, ట్రస్ట్ తరపున ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు,వెంకటాపురం గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# అర్హులైన పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే నాయిని

**డిజిటల్ కార్డు ద్వారా ఎన్నో సంక్షేమ ప్రయోజనాలు**

**నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద 48 మరియు10వ డివిజన్లు**

**ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని వివరాలు అందించాలి**



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: అర్హులైన పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఒకే కార్డు అనేక ప్రయోజనాల నినాదంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారాని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం పశ్చిమనియోజకవర్గ పరిధిలోని కాజీపేట 48వ డివిజన్ దర్గా రామాలయం గుడి దగ్గర జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి డిజిటల్ కార్డు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి 7వ తేదివరకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల (FDC) నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. డిజిటల్ కార్డు ద్వారా రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ,రైతు భీమా, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్య పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. 30 శాఖలు 30 రకాల ప్రయోజనాల దృష్ట్యా చాలా సమస్యలు తలేత్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు (FDC) పొందిన తరువాత రేషన్ మరియు ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు ఎక్కడ నుంచి అయినా పొందే వెసులుబాటు ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గలలో ఒక గ్రామం, ఒక పట్టణం తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే వెల్లడించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రెండు డివిజన్ 48 మరియు 10వ డివిజన్ ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలందరు స్వచ్ఛందంగా పాల్గొని వివరాలు అందించి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సర్తజీ బేగం, మాజీ కార్పొరేటర్ అబూ బకర్, డివిజన్ అధ్యక్షులు సింగరపు రవి ప్రసాద్, మట్టెడ కుమార్, లక్ష్మణ్ నాయక్, అమర్, శ్రీనివాస్, ఇంతియాజ్,డిప్యూటీ కమీషనర్ రవీందర్, ఆర్డీఓ రమేష్, తహశీల్దార్ భావ్ సింగ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## నిరుపేద విద్యార్థికి అండగా ఎమ్మెల్యే కడియం

**మెడికల్ విద్యార్థికి కడియం ఆర్థిక సహాయం**

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామానికి చెందిన చిట్యాల నితిన్ మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించి ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కడియం ఫౌండేషన్ ద్వారా కళాశాల ఫీజు నిమిత్తం మెడికల్ విద్యార్థి చిట్యాల నితిన్ కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు పేద ప్రజలకు సేవ చేయాలని సూచించారు. దీంతో తన పరిస్థితిని అర్థం చేసుకొని ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి, కడియం ఫౌండేషన్ కు విద్యార్థి మరియు ఆయన కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బి ఆర్ ఎస్ రాజ్యసభ ఎంపీ నిధులతో సిసి రోడ్

**భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్**

వాయిస్ టుడే : ఇబ్రహీంపట్నం ప్రతినిధి అక్టోబర్ :03 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో బి ఆర్ ఎస్ రాజ్యసభ ఎంపీ నిధులతో నిర్మాణం చేయనున్న సిసి రోడ్డు కు భూమి పూజ చేసిన డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు ఉన్న ప్రజలు తమని నేరుగా కలవాలని అన్నారు ఎలక్షన్లకు ముందు ఇచ్చిన మాట ప్రకారం తప్పకుండా పనిచేస్తానని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుప్పల నర్సయ్య కంఠం రమేష్ బి ఆర్ ఎస్ కార్యకర్తలు గొర్రె రాజేష్ తోకల దావీద్ సమ్మెట రఘు కోటి అరుణ్ దుద్దల మైపాల్ ప్రజలు పాల్గొన్నారు.



## పిచ్చికుక్క స్వైర విహారం
## ఐదుగురికి గాయాలు - ఒకరి పరిస్థితి విషమం

**భయాందోళనలో గ్రామ ప్రజలు – నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న అధికారులు**






జమ్మికుంట అక్టోబర్ 3 (వాయిస్ టుడే): జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో ఐదుగురికి గాయాలు కాగా ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్కల దాడిలో గండీ స్వరూప, మొగిలిపాక వెంకటస్వామి తోపాటు మరో ఇద్దరు గాయపడగా ఇంటిముందు ఆడుకుంటున్న మద్దర్ల అక్షర అనే పాపపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని వరంగల్ ఆసుపత్రికి తరలించారు. మిగతా గాయపడిన వారు జమ్మికుంట లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ప్రజలను గాయపరుస్తూ తిరుగుతున్న పిచ్చికుక్కను చంపివేయాలంటూ స్థానికులు గ్రామపంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్థానికులు కుక్కను వెంటాడి చంపివేశారు. మండలంలో పిచ్చికుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో పలువురికి గాయాలు కావడంతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి కుక్కల దాడిలో ప్రజలు గాయపడడంతోపాటు భయాందోళన చెందుతున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం కోరపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి తారక రామారావును వివరణ కోరగా తక్షణమే చర్యలు చేపట్టి కుక్కల బెడద నుండి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని తెలిపారు.

# పక్కా కార్యాచరణతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు

**కొనుగోలు సమస్యలు తెలిపేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు**

**కేంద్రాలను జిల్లా కలెక్టర్లు ప్రతి రోజు తనిఖీ చేయాలి**

**దసరా కంటే ముందు టీచర్ల నియామకం పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి**



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: పక్కా కార్యాచరణతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024 సంబంధించి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డీఎస్సి సర్టిఫికెట్ వెరిఫికేషన్, అపాయింట్మెంట్ ఆర్డర్ల ప్రక్రియ పై సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుంచి రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సంబంధించి జిల్లాలో పటిష్ట కార్యాచరణ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో అన్నారు. 7 వేలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్లు , కాంటాలు ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక సిరియల్ నెంబర్ ఏర్పాటు చేయాలని, రైస్ మిల్లులకు తరలించే ధాన్యం బస్తాల పై ఆ సిరియల్ నెంబర్ వేయాలని అన్నారు. సన్న రకం ధాన్యం బస్తాల పై తప్పనిసరిగా సీరియల్ నెంబర్ ఉండాలని.. దీనికి రెవెన్యూ కార్యదర్శులను వినియోగించుకోవాలని సీఎం తెలిపారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచి పోకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని తెలిపారు.

వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులలో ప్రచారం కల్పించాలని, అదే విధంగా సన్న రకం దాన్యం గుర్తింపు పక్కాగా జరిగేలా చూడాలని అన్నారు. బస్తాలలో నింపిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే లా రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని, ప్రతి రోజు పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు లో వచ్చే ఇబ్బందుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద పోలీసులు అప్రమత్తం కావాలని, ఇతర జిల్లాల నుంచి మన వద్దకు ధాన్యం రాకుండా చూడాలని అన్నారు. తాళ్ళు, తరుగు అంశం లో అవకతవకలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారులు ప్రతి రోజు కలెక్టర్ లతో కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షించాలని అన్నారు. సీఎంఓ అధికారుల సైతం నిరంతరం ధాన్యం కొనుగోలును పరిశీలించాలని, రెగ్యులర్ గా నివేదికలు అందించాలని సీఎం అన్నారు. 11,062 టీచర్ల భర్త కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 క్రింద 25,239 మందిని ఎంపిక చేసి ఫలితాలు ప్రకటించామని, ఇప్పటి వరకు 9090 మాది అభ్యర్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరిగిందని అన్నారు. 2రోజుల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, అక్టోబర్ 9 సాయంత్రం 4 గంటలకు ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్మెంట్ ఆర్డర్లు జారీ చేయాలని అన్నారు. దసరా కంటే ముందు టీచర్ల నియామకం పూర్తి కావాలని, జిల్లా కలెక్టర్లు దినిని ప్రాధాన్యత అంశంగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, హనుమకొండ పరకాల డివిజన్ల ఆర్డీవోలు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



## హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని పరామర్శించిన మంత్రి పి శ్రీనివాసరెడ్డి

తొర్రూర్ అక్టోబర్ 03 వాయిస్ టూడే: తొర్రూర్ పట్టణ కేంద్రం లో గురువారం కాసం పుల్లయ్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజక వర్గ ఇంఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు.కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవాని కి ఏర్పాటు చేసిన వేదిక ఒక సారి గా కూలడం తో ఝాన్సీరెడ్డి కాలు విరగడం తో బలమైన గాయాలయ్యాయి.మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ లో గల హైదర్ గూడ అపోలో ఆసుపత్రి లో చికిత్స పొందు తున్న ఝాన్సీరెడ్డి ని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి,ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రి ని సందర్శించి ఝాన్సీరెడ్డి ని పరామర్శించారు.ప్రమాద వివరాల ను పాలకుర్తి ఎంఎల్ఎ మామిడాల యశస్వినిరెడ్డి ని అడిగి తెలుసు కున్నారు.అపోలో ఆసుపత్రి లో చికిత్స పొందు తున్న ఝాన్సీరెడ్డి ని పరామర్శించేందుకు పాలకుర్తి నియోజక వర్గం లోని కాంగ్రెస్ పార్టీ కార్య కర్త లు తరలి వెళ్లారు.ఝాన్సీరెడ్డి కి మెరుగైన వైద్యం అందించాలని శ్రీనివాసరెడ్డి ఆసుపత్రి వైద్యుల ను ఆదేశించారు.అపోలో ఆస్పత్రి లో చికిత్స పొందు తున్న ఝాన్సీరెడ్డి ని తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య.కమీషన్ సభ్యులు బండా సుధీర్ రెడ్డి.మాజీ ఎంఎల్ఎ శ్రీరాం భద్రయ్య. పిసిసి రాష్ట్ర కొ-ఆర్డినేటర్,కొల్లాపూర్ నియోజక వర్గ ఇంఛార్జ్ మొగుళ్ళ అశోక్ గౌడ్,బొబ్బల రమణారెడ్డి. రామసహాయం కృష్ణకిషోర్ రెడ్డి.మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి,నాగార్జునరెడ్డి.కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ సమన్వయ కర్త తిరుపతిరెడ్డి,తొరూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్,గంజి ప్రసాద్-రెడ్డి,దేశగాని.నాగరాజు,మేకల కుమార్,సుంచు సంతోష్,ల తో పాటు నియోజక వర్గం లోని మండలా ల కాంగ్రెస్ నాయకులు భారీ గా తరలి వచ్చి ఝాన్సీరెడ్డి ని పరామర్శించారు.

## పిల్లల నిబంధనలు తొల గించడం అభినందనీయం



తొర్రూర్ అక్టోబర్ 03 వాయిస్ టూడే: స్థానిక సంస్థల ఎన్నికల లో ఇద్దరు పిల్లల నిబంధన ను ఎత్తేసి గ్రామ పంచాయి తీ,మండల,జిల్లా పరిషత్ లాంటి స్థానిక సంస్థల కు జరిగే ఎన్నికల లో పోటీ చేయడానికి అభ్యర్థి కి ముగ్గురు పిల్లలు ఉంటే అనర్హులు అవుతారనే నిబంధన ఉండ గా,ఆ నిబంధన ను తాజా గా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగించడం అభినంద నీయమని అమర్ సింగ్ తండా తాజా మాజీ సర్పంచ్ హపావత్ సురేష్ నాయక్ అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ., ముగ్గురు బిడ్డ లు ఉంటే అనర్హులు గా ఉన్న నిబంధన ను ఎత్తివేస్తున్నట్టు ఇటీవల సమావేశమైన తెలంగాణ మంత్రి వర్గం ఈ నిర్ణయం హర్షనీయ మన్నారు.క్యాబినెట్ నిర్ణయాన్ని ఎంఎల్ సి తీన్మార్ మల్లన్న వీడియో ను రిలీజ్ చేయడం సంతోషం గా ఉందన్నారు.గతం లో గ్రామ పంచాయితీ ఎన్నికల కు పోటీ చేసే అభ్యర్థి కి గరిష్ఠం గా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలని.అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారు అనర్హులు అవుతారని తీసుక వచ్చిన చట్టం 1994 మే 30 వ తేది నుంచి అమల లోకి వచ్చిందని,ఆ తేది కి ముందు ఎంత మంది పిల్లలు ఉన్న ఎన్నికల లో పోటీ చేసేందుకు అర్హులు అవు తారని,ఐతే ఈ చట్టం అమల లోకి వచ్చిన ఒక సంవత్సరం లోగా అంటే 1995 మే 29 వ తేది లోగా మూడవ బిడ్డ పుట్టిన అనర్హులు కాకుండ మినహాయింపు ను ఇచ్చిన ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలియ చేశారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రణవ్.. ఆ కాలనీకి ఆపద్బాంధవుడు

**గాంధీనగర్‌లోని బేడ బుడగ జంగాల కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి**

హుజూరాబాద్ అక్టోబర్ 3 (వాయిస్ టుడే): మాట ఇవ్వడమే కాదు దాన్ని నిలబెట్టుకున్నప్పుడే నిజమైన లీడర్ అవుతాడని నానుడి దానికి తగ్గట్టుగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వోడితల ప్రణవ్ అందరి దృష్టిలో ఆపద్బాంధవుడు అవుతున్నాడు. గతంలో వర్షాలు కురిసినప్పుడు వరద ప్రవాహం అంతా హుజురాబాద్ పట్టణంలోని గాంధీనగర్ లోని బేడ బుడగ జంగాల కాలనీ లోని గృహాలకు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న ప్రణవ్ అక్కడ నివసించే ప్రజలు మా కాలనీ యొక్క అవస్థలు చూడమని ప్రణవ్ కు తెలుపగా స్పందించిన ప్రణవ్ త్వరలోనే మీ కాలనీకి తగిన సాయం చేస్తానని మాట ఇవ్వడం జరిగింది.ఇచ్చిన మాట ప్రకారం బుధవారం రోజున ఆ కాలనీలో మొరం పోయించి చదును చేపించారు. భారీ వర్షాలు కురుసిన ప్రతీ సమయంలో కాలనీ అస్తవ్యస్తం అవుతుందని, ఇన్నాళ్లుగా తమ కాలనీనీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడనీ,సమస్య చెప్పిన కొద్దిరోజుల్లోనే పరిష్కారం చూపిస్తున్న ప్రణవ్ కు కాలనీవాసులు జీవితాంతం రుణపడి ఉంటామని అంటున్నారు. రాజకీయాలకతీతంగా సమస్యల పరిష్కార విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఇలాగే కొనసాగి మా సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కొన్నేళ్లుగా పరిష్కారం కానీ సమస్యలను కూడా మానవతా దృక్పథంతో ప్రణవ్ చేస్తున్నాడని పలువురు అభిప్రాయపడ్డారు.



వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం

హైదరాబాద్
శుక్రవారం, 4 అక్టోబరు 2024

# కార్పొరేట్లకు ఊడిగం చేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించండి

## కార్మిక, కర్షక అనుకూల విధానాల సాధనకై సిపిఎం నిరంతర పోరాటం

వాయిస్ టుడే అక్టోబర్ 3 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ): సిద్దిపేట జిల్లా నాగపురి సంపద సృష్టించే కార్మిక, కర్షక అనుకూల విధానాలను వీడి పెట్టుబడిదారీ కార్పొరేట్ విధానాలను ప్రోత్సహించే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సిపిఎం నిరంతరం పోరాడుతుందని అంతిమంగా కార్మికులది కర్షకులదే విజయమని సిపిఎం నిర్వహించే పోరాటాల్లో కార్మికులు కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరాడాలని నేడు దేశంలో ఉన్న బూర్జువా పార్టీలను ప్రతిఘటించిన నాడే కార్మికుల, కర్షకులకు అనుకూల పరిస్థితులు సాధ్యమైతాయని దోపిడి విధానం పోయి సమ సమాజం సిద్ధిస్తుందని నిత్యం కార్మికుల కోసం, కర్షకుల కోసం నిర్వహించే పోరాటాల్లో శ్రామికులు, కర్షకులు పాల్గొనాలని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ పిలుపునిచ్చారు. గురువారం రోజున చేర్యాల మండలం నాగపురి గ్రామ సిపిఎం పార్టీ శాఖ మహాసభ మోకు దేవేందర్ రెడ్డి అధ్యక్షతన నాగపురి లో జరిగింది. ఈ గ్రామ శాఖ మహాసభలో ముఖ్యఅతిథిగా




పాల్గొని రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ నేడు దేశంలో కార్మిక వర్గం, రైతులు, శ్రామిక ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతుల, కార్మికుల, శ్రామిక ప్రజల బతుకులు దుర్భరంగా దిగజారిపోతున్నాయి తప్ప ఈ కార్పొరేటు అనుకూల విధానాలను అమలు చేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా సంపన్న కార్పొరేట్ లకే కొమ్ముగాస్తున్నాయని దీనిపై శ్రామికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున సిపిఎం నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములు కావాలని నాగపురి గ్రామంలో మహిళలు యువకులు సిపిఎం నిర్వహించే పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా మోకు ఇంద్రం ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా సోషల్ మీడియా ఇన్చార్జిగా భూలక్ష్మీ నర్సింగరావును ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, మండల కమిటీ సభ్యులు గొర్రె శ్రీనివాస్, ఎన్ కనకయ్య, మోకు దేవేందర్ రెడ్డి , బోయిన మల్లేశం, ధన్న రమేష్, గంధాల బాలు, ఎస్డి ఇస్మాయిల్, గర్నపెల్లి చంద్రం, జిడాల చంద్రయ్య, ఆవుల చంద్రయ్య, ముత్తగారి లక్ష్మయ్య, కుర్జకుంట కనకయ్య, ముత్తగారి శ్రీను, దేవులపల్లి రమేష్, దేవులపల్లి కృష్ణమూర్తి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## న్యాయవాది పీ దాడిని త్రీవంగా ఖండిస్తున్నాం

**– హుజూరాబాద్ బార్ అసోసియేషన్**

హుజూరాబాద్ అక్టోబర్ 3 (వాయిస్ టుడే): హైదరాబాద్ లోని సిటీ సివిల్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న కలీం పై సెప్టెంబర్ 28న మాదన్నపేట పోలీసుల దాడిని ఖండిస్తూ హుజురాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సెక్రెటరీ మట్టేల తిరుపతి మాట్లాడుతూ న్యాయ వ్యవస్థను, న్యాయవాదులను కించపరుస్తూ పోలీసులు మాట్లాడిన తీరును ఆయన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కలీంపై పరుష పదజాలంతో మాట్లాడి దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదుల మీద జరుగుతున్న దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే న్యాయవాదుల రక్షణ కోసం చట్టం కూడా వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పులుగు లింగారెడ్డి, భూమిరెడ్డి, వై అరుణ్ కుమార్, జీ నరసింహస్వామి, శ్రీనివాస్, ఏ లింగమూర్తి, సిహెచ్ భాను కిరణ్, ఏం రాజేందర్, మురళి, మౌనిక, సౌమిత్ర, హరిహరన్, కళ్యాణ్, కుమార్, ఆస్మిన్ తదితరులు పాల్గొన్నారు.



## దుకాణా యజమానులకు తగు సూచనలు ఇచ్చి కౌన్సిలింగ్ నిర్వహించిన పట్టణ సి ఐ వరగంటి రవి

జమ్మికుంట అక్టోబర్ 3 (వాయిస్ టుడే): జమ్మికుంట టౌన్ సి ఐ వరగంటి గురువారం రోజు పట్టణం లోని గాంధీ చౌరస్తా నుండి ఫ్లైఓవర్ బ్రిడ్జి బస్టాండ్ దగ్గర రోడ్డు ఇరువైపులా గల దుకాణాల యజమానులను పిలిచి బస్టాండ్ ముందు కౌన్సెలింగ్ చేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రతీ దుకాణం ప్రజలతో కిక్కిరిసి పోయి ఉంటాయి కావున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగా కుండా ఎవరి షాప్ ముందు ఇతర దుకాణాల ఏర్పాటు చేయకుండా అలాగే షాప్ ముందు గల గీత లోపలనే వాహనాల పార్కింగ్ చేసుకోవాలి సూచించారు. అలా లేని యెడల షాప్ యజమానికి నోటీసులు ఇచ్చి చట్ట పరమయిన చర్యలు తేసుకోబడును అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో సి ఐ తో పాటు ఎస్ ఐ ఆరోగ్యం మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థి డా వి.నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం..

**ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి: పట్టభద్రుల సమస్య పరిష్కారానికి కృషి**



కరీంనగర్ అక్టోబర్ 03(వాయిస్ టుడే)రానున్న కరీంనగర్ అదిలాబాద్ నిజాంబాద్ మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి కోరారు... గురువారం కరీంనగర్ పట్టణంలో పలు ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలతో పాటు విద్యుత్ భవన్ లో పలువురు విద్యుత్ ఉద్యోగులను కలిసి తనకు మద్దతు తెలిపారని కోరారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల కృషి చేస్తానని , పట్టభద్రులకు ప్రభుత్వానికి వారధిగా ఉండి ఉద్యోగ విద్యారంగ సమస్యల పై పోరాడుతానని వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో పలువురు కరాస్పడేంట్లు ఉపాధ్యాయులు ఉద్యోగులు తదితరు పాల్గొన్నారు.

## జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు

**కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్.**




కరీంనగర్ అక్టోబర్ 03(వాయిస్ టుడే)కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో రాజన్న జోన్ –III( కరీంనగర్, మెదక్, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి ) స్థాయిలో పోలీస్ అధికారులకు సిబ్బందికి గురువారంనాడు వివిధ విభాగాల్లో కమీషనరేట్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహించామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ ఎంపిక కొరకు కమీషనరేట్లు జిల్లాల వారీగా ఈ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో ముఖ్యంగా ఫోరెన్సిక్ సైన్స్ , క్రైమ్ ఇన్వెస్టిగేషన్ చట్టాలు , మెడికో లీగల్ టెస్ట్ , ఫింగర్ ప్రింట్ సైన్స్ , క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ, క్రైమ్ సీన్ పరిశీలన , ఆంటీ సాబాటేజ్ చెకింగ్ లో భాగంగా వాహనాల చెకింగ్ , గ్రౌండ్ తనిఖీ , రూమ్ తనిఖీ , యాక్సిస్ కంట్రోల్ లో నైపుణ్యత, కంప్యూటర్ పై అవగాహన, డాగ్ స్క్వాడ్ లో ట్రాకింగ్ , ఎక్సప్లోజివ్ నార్కోటిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో జోనల్ స్థాయి తర్వాత రాష్ట్ర స్థాయిలో మరల పోటీలు నిర్వహించి ఎంపికలు వుంటాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక అయినవారికి శిక్షణ అనంతరం ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. ఈ డ్యూటీ మీట్ పోటీల్లో కమిషనరేట్ లోని అన్ని విభాగాలు డివిజన్ ల నుండి అధికారులు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.



## చింతలపాలెం నూతన ఎస్ఐగా అంతిరెడ్డి బాధ్యతల స్వీకరణ

వాయిస్ టుడే న్యూస్ చింతలపాలెం ప్రతినిధి: సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం చింతలపాలెం మండల. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నర్రా అంతిరెడ్డి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ. చింతలపాలెం మండల ప్రజలతో నిత్య అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని అసాంఘిక కార్యకలాపాలపై గట్టి చర్యలు చేపడతానని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి



వాయిస్ టుడే ప్రతినిధి(హుస్నాబాద్/కోహెడ )అక్టోబర్ 03: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల గ్రామ వాస్తవ్యులు కేతిరెడ్డి రామచంద్రారెడ్డి తల్లి కమలవ్వ గారు కొద్ది రోజుల క్రితం మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి వారితోపాటు కూరెల్ల మాజీ ఎంపీటీసీ జాగిరి కుమారస్వామి.గాజుల రవీందర్. జాగిరి సతీష్. తదితరులు ఉన్నారు.



## గ్రామ పంచాయతీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : మంత్రి పొన్నం

వాయిస్ టుడే ప్రతినిధి(హుస్నాబాద్/కోహెడ )అక్టోబర్03: తెలంగాణరాష్ట్ర గ్రామపంచాయతీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలియజేశారు. గురువారం కరీంనగర్ నుండి తాహెర్ కొండాపూర్ వెళు _ండగా మార్గమధ్యంలో చెర్ల భుత్కూరు వద్ద గ్రామ పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి సరైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని,జీతాలు సరిగా రావడం లేదని తెలియజేయడంతో గ్రామ కార్యదర్శి ,స్పెషల్ ఆఫీసర్ తో మాట్లాడి వారి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



## యాదగిరిగుట్ట బీసీలో ఘనంగా ఎంగిలి పువ్వు బతుకమ్మ సంబరాలు

వాయిస్ టుడే/ యాదగిరిగుట్ట:యాదగిరిగుట్ట బీసీ కాలనీలోఎంగిలి పువ్వుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.సాంప్రదాయ వస్త్రాలతో ఒకే రంగు చీర కట్టుకుని మహిళా మణులు అందంగా తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి అందరు కలిసి కాలనీలో బతుకమ్మను పెట్టి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ కోలాటం ఆడుతూ బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి మహిళలు ఈ తొమ్మిది రోజులు ఎంతో సంతోషంగా ఉంటామని తెలిపారు.

## అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని బహిరంగంగా ఉరి తీయాలి

**సోమల్ల మహేందర్ కురుమ రాష్ట్రీయ సంగోలి రాయన్న సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు**

**నిందితున్ని శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి**

**ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఉన్నవారికి ఒక న్యాయం పేదవారికి ఒక న్యాయం ఉండకూడదు**



వాయిస్ టుడే అక్టోబర్ 3 (సిద్దిపేట జిల్లా ప్రతినిధి): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో కడు పేద కుటుంబానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన హత్యాచార ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ సంగోలి రాయన్న సేన రాష్ట్ర అధ్యక్షులు సోమల్ల మహేందర్ కురుమ భువనగిరి లో మీడియాతో మాట్లాడుతూ గురువన్న పేట గ్రామంలోని సామజికంగా అభివృద్ధికి నోచుకోని కురుమ గొర్ల కాపార్ల సామాజిక వర్గానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న, కడు పేద కుటుంబానికి చెందిన మైనర్ బాలిక పై షరీఫ్ అనే వ్యక్తి(20) అత్యాచారానికి పాల్పడటం మానవత్వం మంటగలిపే సంఘటన నిందితుని తక్షణమే ఉరితీయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకూ రాష్ట్రీయ సంగోలి రాయన్న సేన పోరాడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వాలు ఎంత కఠిన చట్టాలు తీసుకొచ్చిన ఇలాంటి మానవ మృగాలు ఎక్కడొక చోట ఇలాంటి ఘటన పాల్పడుతున్నారని ఇలాంటి మానవ మృగాలను వెంటనే ఉరితీయాలి బాధితుల పక్షాన ప్రభుత్వం నుండి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.



## సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల ఐకేపీ సెంటర్లు... అవసరమైన చోట కొత్త ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయాలి... సన్నవడ్ల కొనుగోలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి... సన్నవడ్ల కు 500 రూపాయల బోనస్... ఐకేపీ సెంటర్ల కి సీరియల్ నెంబర్లు ఇవ్వాలి. సన్నవడ్ల పై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలి. గోనె సంచులను అందుబాటులో ఉండాలి. ధాన్యం కొనుగోలు లో వ్యవసాయ అధికారులను ఇన్వాల్వ్ చేయాలి. కొనుగోలు చేసిన ధ్యానం వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలి. ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజు కలెక్టర్లు రెండు గంటలు ధాన్యం కొనుగోలు పైన సమీక్ష జరపాలి. ధాన్యం కొనుగోళ్ల పైన కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలో కి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటన లు చేయాల్సిందే. తాలు ,తరుగు,తేమ పేరు తో రైతులను మోసం చేసేవారిని సహించవద్దు... క్రిమినల్ కేసు లు పెట్టాలి. రాష్ట్రంలో వంద శాతం రైతులు సన్నబియ్యం పండించేలా చొరవ చూపించాలి. వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనల ప్రకారం ఐకేపీ సెంటర్లలో ఏర్పాట్లు చేయాలి.

## యాదగిరిగుట్ట శ్రీరామ్ నగర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఘనంగా ఎంగిలి పువ్వు బతుకమ్మ సంబరాలు

వాయిస్ టుడే/ యాదగిరిగుట్ట:యాదగిరిగుట్ట శ్రీరామ్ నగర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎంగిలి పువ్వుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.సాంప్రదాయ వస్త్రాలతో ఒకే రంగు చీర కట్టుకుని మహిళా మణులు అందంగా తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి అందరు కలిసి కాలనీలో బతుకమ్మను పెట్టి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ కోలాటం ఆడుతూ బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి మహిళలు ఈ తొమ్మిది రోజులు ఎంతో సంతోషంగా ఉంటామని తెలిపారు.



# జిల్లాలో కొత్తగా 12 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన

**పి ఎస్ పేరు మార్పుకు ప్రతిపాదించినవి 48..**

**పి ఎస్ స్థానాన్ని మార్చడానికి ప్రతిపాదించినవి 5..**

**యువ ఓటర్లు నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్..**

**– కలెక్టర్ పి ప్రశాంతి**



రాజమహేంద్రవరం, అక్టోబర్ 3 (వాయిస్ టుడే ప్రతినిధి) జిల్లాలో 15 వందలు పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి , ఆమేరకు 12 కొత్త పోలింగు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదన చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఎస్ ఎస్ ఆర్ 2025 , పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై రాజకీయ భాగస్వామ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఎస్ ఆర్ 2025 ను,ఇప్పటి వరకు ఓటర్ల జాబితా ను అనుసరించి ఇంటింటి సర్వే చేపట్టడం ద్వారా ఓటర్ల జాబితా ను 99.94 శాతం పరిశీలనా పూర్తి చేశామన్నారు. పోలింగ్ స్టేషన్ భవనాల భౌతిక ధృవీకరణ , పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణ, పునః-ఏర్పాట్ల పరిశీలన చేపట్టడం జరుగుతొందని పేర్కొన్నారు. ఓటరు జాబితా రూపకల్పన లో చిరునామా మార్పులు, చేర్పులు, మరణాలు తదితర అంశాల మేరకు ఓటర్ జాబితాను సవరణ చెయ్యడం జరుగుతున్నట్లు చెప్పారు. 17 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఆమేరకు డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు.ప్రతి మూడు నెలలకు కొత్త ఓటరు నమోదు కోసం 18 ఏళ్లు నిండిన ఓటర్లు గుర్తించే విధానాన్ని కొనసాగింపు చర్యల తీసుకుంటామన్నారు. ఎస్ ఎస్ ఆర్ 25 ను అనుసరించి 2025 జనవరి ఒకటవ తేదీ అర్హత తేదీగా ఫోటో ఎలక్టోరల్ రోల్స్ చేపట్టడానికి షెడ్యూల్ నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్ ఎస్ ఆర్-2025 షెడ్యూల్ ప్రకారం, జిల్లాలోని నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మరియు నియోజక వర్గ ఎలెక్టోరల్ అధికారులు ద్వారా పోలింగ్ స్టేషన్ భవనాల భౌతిక ధృవీకరణను సక్రమంగా నిర్వహించడం ద్వారా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, పునఃచేపట్టామన్నారు. ఆమేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**సమావేశంలో ప్రతిపాదించిన అజెండా అంశాలు..**

పోలింగ్ స్టేషన్ స్థానాన్ని మార్చడానికి రాజమండ్రీ సీటీ అసెంబ్లీ నియోజక వర్గంలో 5 పిఎస్ లు ప్రతిపాదన చేశామన్నారు.పోలింగ్ స్టేషన్ నామకరణం మార్పు కోసం అనపర్తి నియోజకవర్గం పరిధిలో 48 ప్రతిపాదనలను చేసినట్లు తెలిపారు.జిల్లాలో 1500 మంది ఓటర్లు పైన ఉన్న 13 పోలింగ్ స్టేషన్ గుర్తించి కొత్తగా 12 పి ఎస్ లలో రాజమండ్రీ సీటీ లో 9 , రాజమండ్రి రూరల్ 3 ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తద్వారా జిల్లాలో 1569 పీఎస్ లకు బదులు 1581 పోలింగు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.జిల్లాలో పోలింగ్ స్టేషన్ విలీనం,తొలగింపు కోసం ప్రతిపాదనలు ఏమి లేవని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు.కార్యక్రమంలో డి ఆర్వో జి .నరసింహులు, రాజకీయా పార్టీల ప్రతినిధులు బిజెపి జనరల్ సెక్రటరీ గుర్రాల వెంకట్రావు, సిపిఐ (ఎం ) జిల్లా సెక్రెటరీ టి.అరుణ్, వైఎస్ఆర్ సీపి పోలింగ్ మేనేజ్మెంట్ ఇంచార్జ్ కే. రాజశేఖర్, కలెక్టర్ ఎన్నికల సూపరింటెండెంట్ జి ఎల్ ఎస్ దేవి, ఎలక్షన్ డిటి గిరీష్ కుమార్, తదితరులు పాల్గొ న్నారు.



## యాదాద్రి కొండపై శరన్నవరాత్రి ఉత్సవాలు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పర్వత వర్ధని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి.మొదటి రోజు అర్చకు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలతో విఘ్నేశ్వర పూజ,పుణ్యాహవాచనం రక్షా బంధం పంచగవ్యప్రాసన అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవాల్లో అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి,ఈఓ భాస్కరరావు,ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి నృసింహుడు దర్శించుకున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి కౌశిక్ రెడ్డి కి స్వామివారి అభిషేక మహా ప్రసాదం లడ్డూను అందజేశారు..

## కులం పేరుతో దుర్భాషలాడిన వ్యక్తికి క్షమాభిక్ష పెట్టిన దళిత యువకులు



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా అక్టోబర్, 3 జడ్చర్ల:నవాబ్ పేట మండల పరిధిలోని నిన్న రాత్రి కాకర్ల పహాడ్ గ్రామంలోని బీసీ కులానికి చెందిన పాశం రమేష్ అనే వ్యక్తి దండు ఆనంద్ అనే దళిత వ్యక్తిని కులం పేరుతో దూర్భాషలాడడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆది జాంబవ యూత్ అసోసియేషన్ సభ్యులు మరియు యువకులు రమేష్ ను అందరూ ఉదయాన్నే రచ్చబండ దగ్గరకు పిలిపించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని హెచ్చరించడం జరిగింది. ఇందుకు గ్రామ పెద్దలందరూ క్షమించమని ఆనందును కోరుతూ మరొకసారి ఇలాంటి తప్పు జరగదని కులమత బేధాలు లేకుండా అందరం సమానంగా ఉంటామని మాట ఇవ్వడం జరిగింది. ఇందుకు దండు ఆనంద్ నన్ను క్షమించమని కోరడం కాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలతో అభిషేకం చేయాలని డిమాండ్ చేశాడు. ఇందుకు రమేష్ అనే వ్యక్తి ఒప్పుకొని గ్రామ పెద్దలు ఊరందరి సమక్షంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి కొబ్బరికాయ కొట్టి నివాళి అర్పించడం జరిగింది. ఇక మీదట ఎవరిని ఇలా కులం పేరుతో దూషించనని కుల పెద్దలందరిని వేడుకున్నాడు. ఇందుకు దండు ఆనందు ఈ గ్రామంలో మరొకసారి ఇలాంటి సమస్య వచ్చినట్లయితే సహించేది లేదని కచ్చితంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించడం జరిగింది. ఇందుకు ఆది జాంబవ యూత్ డా.బాబా సాహెబ్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు 50 మందికి పైగా యువకులు తరలివచ్చి నినాదాలు చేశారు.

# కొత్తగూడెం పాల్వంచ ను మున్సిపల్ కార్పొరేషన్ చేసే ప్రతిపాదనను విరమించుకోవాలి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పదవితో పాటు ఇతర నామినేట్ పదవులు ఆదివాసీలకు ఇవ్వా.**

**లంబాడీల ను ఎస్టి జాబిత నుండి తొలగించాలి.**

**పై మూడు అంశాలపై ఆదివాసీ సంఘాల తీర్మానం చేశారు.**



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 3) గురువారం లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో లో ఆదివాసీ సంఘాల అత్యవసర సమావేశం తుడుందెబ్బ కొత్తగూడెం డివిజన్ అధ్యక్షులు పాయం లక్ష్మినర్సు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశం తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వర రావు, ఆదివాసీ సేన ఉకే రవి , పోడియం బాలరాజు పాల్గొని మాట్లాడుతూ కొత్తగూడెం పాల్వంచ మండలాలతో పాటు లక్ష్మీదేవిపల్లి,చుంచుపల్లి, సుజాతనగర్,మండలం లోని ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్ చేయాలి అనే ప్రతిపాదనను విరమించుకోవాలని అన్నారు.కార్పొరేషన్ చేయటం వలన 5 వ శద్యుల్డ్ ప్రాంత హక్కులు 1/70 చట్టం, పీసా చట్టం, వంటి వంటి హక్కులు కోల్పోతామని అన్నారు. ఆర్టికల్ 243 జెడ్( సి ) నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతాలను కార్పొరేషన్ చేయటం విరుద్ధం అని , కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు కోల్పోతామని, 100 రోజుల పని, సర్పంచ్, వార్డు మెంబర్,ఎంపీటీసీ, వంటి రాజకీయ పదవుల పోవటం తో పాటు ఉద్యోగ అవకాశాలు కోల్పోతామని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఇతర నామినేటెడ్ పదవులు ఆదివాసీలకు ఇవ్వాలని, గతం లో కూడా లంబాడా లకు నామినేట్ పదవులు ఇచ్చి ఆదివాసీలకు అన్యాయం చేశారని,కొత్తగూడెం నియోజక వర్గం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల ఎంపీపీ పదవులు లంబాడాలకు ఇచ్చి ఆదివాసీలకు అన్యాయం చేశారని మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఇతర నామినేటెడ్ పదవులు ఆదివాసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.లంబాడీల తొలగింపు తోనే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని లంబాడీలు ఆదివాసీ విద్య ,ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్ని కొల్ల గొడుతున్నారనీ అన్నారు లంబాడీల తొలగింపు తోనే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆదివాసీ అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అరేం పాపారావు, ఆదివాసీ సేన రాష్ట్ర నాయకులు శెట్టిపల్లి శ్రీను, వర్స లక్ష్మణ్ 9 తెగల సమన్వయ కర్త ,పోలెబోన వెంకటేశ్వర్లు ఏ ఈ డబ్ల్యూ సి ఏజిల్లా అధ్యక్షులు, జెజ్జర లింగేశ్వరరావు, వర్స నరసింహారావు, బడిస భిక్షం, ఉకె ముత్తేష్, తుడుందెబ్బ సీనియర్ నాయకులు దారబోన రమేష్ , జి ఎస్ ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఆరేం ప్రశాంత్ ఈసాల దేవేందర్, సర్పపాక మురళీ,మేకల కృష్ణ ాల్గొన్నారు.



## పాములపర్తి గ్రామంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

**పూజలో పాల్గొన్న బేతి మధుసూదన్ రెడ్డి శ్రావణి దంపతులు**

వాయిస్ టుడే అక్టోబర్ 3 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి.మొదటి రోజు పూజలో బెతి మధుసూదన్ రెడ్డి శ్రావణి దంపతులు పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు.శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.శరావళి మాత ఉత్సవ సేవ సమితి ఆధ్వర్యంలో గత ఎనిమిది సంవత్సరముల నుండి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది.ప్రతి సంవత్సరం 30 మంది అమ్మవారి దీక్ష తీసుకోవడం జరుగుతుంది. ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,అదేవిధంగా అమ్మవారి టోకెన్ చీర 101 రూపాయలతో టోకెన్ తీసుకొని అదృష్టాన్ని, అమ్మవారి కృపా కటక్షాన్ని పొందగలరని శరావళి మాత ఉత్సవ సేవా సమితి తెలిపారు.ఈ కార్యక్రమంలో శరావళి మాత ఉత్సవ సేవా సమితి సభ్యులు,గ్రామ ప్రజలు,అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## అసమానతలు లేని సమాజం కమ్యూనిస్టుల తోనే సాధ్యం

**సిపిఎం సీనియర్ నేత జిఎస్ శంకర్రావు !**

భద్రాచలం, అక్టోబర్ 03 (వాయిస్ టు డే) స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఎం సీనియర్ నాయకులు జిఎస్ శంకర్రావు పిలుపునిచ్చారు. గురువారం ఇందిరా నగర్, శిల్పి నగర్ సిపిఎం పార్టీ శాఖ మహాసభల సందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల జీవితాల్లో మార్పు రావడంలేదని అన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ కార్యకర్తలు ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్మించాలని ఆయన సూచించారు. కేంద్రంలో బిజెపి అధికారంలో వచ్చిన ఈ పది సంవత్సరాల కాలంలో పేదరికం, నిరుద్యోగం రోజురోజుకీ తీవ్రంగా పెరిగిందని అన్నారు. బిజెపి ప్రభుత్వం సంపన్న వర్గాల అభివృద్ధికి మాత్రమే పనిచేస్తుందని విమర్శించారు. కార్మికులను, పేదలను విస్మరిస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు వేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని మహాసభలో తీర్మానంచేయడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా విధానాల వల్ల తీవ్ర అసమానతలు తిరిగాయని అన్నారు. అసమానతలు లేని సమాజం కమ్యూనిస్టులతోనే సాధ్యమని జి. ఎస్ శంకర్ రావు అన్నారు. మహాసభలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, శాఖ కార్యదర్శి గుండోజు రాధా, కుమారి , వెంకటమ్మ, కమల, రాణి , స్వరాజ్యం, సరస్వతి, మంగయ్య , ఆశ పాల్గొన్నారు.


## బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

**ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



అనంత పురం అక్టోబర్ 03 వాయిస్ టుడే : సింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సంఘటన బాధాకరమని వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ భరోసా ఇచ్చారు.బాధిత కుటుంబంతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పాప మరణించడం చాలా బాధాకరం అన్నారు. ఇంజక్షన్ వికటించి పాప మరణించిందని కారకులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నియామకం



అనంతపురం, అక్టోబర్ 03 : వాయిస్ టుడే : అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర లేబర్, టెక్స్టైల్స్ మరియు స్కిల్ డెవలప్మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. అనంతపురం పార్లమెంట్ సభ్యులుగా తొలిసారి ఎన్నికైన అంబికా లక్ష్మీనారాయణ ఇప్పటికే కేంద్ర ఓ బి సీ సిల్క్ బోర్డు సంక్షేమ సభ్యులుగా ఉండగా, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన లేబర్, టెక్స్టైల్స్ , స్కిల్ డెవలప్మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎంపీని నియమించడం జరిగింది. దీనితో ఎంపీకున్న బాధ్యతలు మరింత పెరిగాయి.లేబర్, టెక్స్టైల్స్ , స్కిల్ డెవలప్మెంట్ స్టాండింగ్ కమిటీకి బసవరాజ్ బొమ్మాయి చైర్ పర్సన్ గా నియామకం కాగా, కమిటీ సభ్యులుగా లోక్ సభకు చెందిన 21 మంది ఎంపీలు ఉండగా, రాజ్యసభకు చెందిన 10 మంది ఎంపీలు ఉండగా, లేబర్, టెక్స్టైల్స్ , స్కిల్ డెవలప్మెంట్ స్టాండింగ్ కమిటీలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర లేబర్, టెక్స్టైల్స్ మరియు స్కిల్ డెవలప్మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 4 అక్టోబరు 2024

# జిల్లాలో ప్రారంభమైన డిజిటల్ కార్డు సర్వే

## కుటుంబ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 3) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియ గురువారం జిల్లాలో ప్రారంభమైంది. డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ డిజిటల్ కార్డు జారీ చేసేందుకు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో ఏడు గ్రామాలు, మూడు మున్సిపాలిటీ ల లోని వార్డులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. లక్ష్మీదేవి పల్లి మండలం లాల్ తండా పంచాయతీలో 171 కుటుంబాలు, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో 330 కుటుంబాలు, దమ్మపేట మండలం ఆళ్లపల్లి పంచాయతీలోని 175కుటుంబాలు, ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో 178 కుటుంబాలు, అశ్వాపురం మండలం అశ్వాపురం మండలం చందర్లపాడు పంచాయతీ లోని 190 కుటుంబాలు, మణుగూరు మున్సిపాలిటీలోని ఆరవ వార్డులో 248 కుటుంబాలు, చర్ల మండలం పులిగుండాల గ్రామంలో 190 కుటుంబాలు, భద్రాచలం గ్రామ పంచాయతీలోని 9వ వార్డులో 280 కుటుంబాలు, దమ్మపేట మండలం ఆళ్లపల్లి గ్రామంలోని 175 కుటుంబాలు, ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలోని 178 కుటుంబాలు, ఇల్లందు మండలం పూబెల్లి పంచాయతీలోని 172 కుటుంబాలు ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డులో 310 కుటుంబాలకు ఈ కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కుటుంబ డిజిటల్ కార్డ్ లో కుటుంబ వివరాలను ఎటువంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సర్వేలో కుటుంబ సభ్యుల పేర్లు, పుట్టిన తేదీ, యజమానితో గల సంబంధం తదితర వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలనిఅధికారులకు తెలిపారు. అదేవిధంగా కుటుంబంలో చనిపోయిన, వివాహం చేసుకొని వెళ్లిన వారి వివరాలను తొలగించాలని అదేవిధంగా కొత్తగా వివాహమై కుటుంబంలోకి వచ్చిన వివరాలను పిల్లల వివరాలను నమోదు చేయాలనితెలిపారు. కుటుంబ సభ్యుల అనుమతితో గ్రూప్ ఫోటో పొందుపరచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సర్వేలో అదనపు కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. సర్వేలో భాగంగా ఎటువంటి సందేహాలు వున్నా వెంటనే తమ దృష్టికి తేవాలని అధికారులను ఆదేశించారు.



## పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ మరియు గజ్వేల్ పోలీసుల దాడి

వాయిస్ టుడే అక్టోబర్ 03( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ గ్రామం ఎంబారి రామచంద్రం రియల్ ఎస్టేట్ ఆఫీసులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం రాగా సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు వెళ్లి రైడ్ చేసి 06 గురు వ్యక్తులు కలసి పేకాడుతుండగా అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 77,180/- వేల రూపాయలు, 06మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు,

గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.

పేకాట ఆడిన వారి వివరాలు: 1 ఎంబారి రామచంద్రం, 2 ఎల్దండి వెంకట్ రెడ్డి 3 తాటికొండ బలరాం రెడ్డి , 4 గడీల కర్ణాకర్ రెడ్డి, 5 చేతిరెడ్డి చిన్నారెడ్డి, 6 వి రమేష్

### అందరి నివాసం గజ్వేల్ పట్టణం

ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాలలో ఫామ్ హౌస్ లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



## బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

### నూతన కార్యదర్శికి స్వాగత సత్కారం

ముదిగొండ మండలం అక్టోబర్ 3 వాయిస్ టుడే : ముదిగొండ మండలం లోని పండ్రేగుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. నరేష్ బదిలీ పై పల్లెగూడెం వెళుతున్న సందర్బంగా గురువారం గ్రామ గ్రామపంచాయతీలో శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేశారు. నూతనంగా విధుల్లో చేరిన పంచాయితీ కార్యదర్శి తులసి రామ్ కి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పండ్రేగుపల్లి మాజీ సర్పంచ్ ఓబినబోయిన అమరయ్య, నేలకొండపల్లి మాజీ మార్కెట్ డైరెక్టర్ పాము సిల్వరాజ్, మాజీ ఉప సర్పంచ్ షేక్ తాజుద్దీన్, మంకెన నాగేశ్వరరావు, రంగు లక్ష్మా చారి, పంచాయతీ సిబ్బంది, బలంతు రాంబాబు, బలంతు అర్లప్ప, షేక్ యాకుబ్, షేక్ జానిమియా, ఒబినబోయిన పుల్లయ్య,ధనమూర్తి, బలంతు వెంకటి, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## శాంతికని మైన్ మైసమ్మ తల్లి ఆలయంలో జాదవ్ కిస్టు నాయక్ ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవములు



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి అక్టోబర్ 3 2024 (వాయిస్ టుడే) : నవరాత్రుల సందర్భంగా తేదీ 3/10/2024 రోజు నుండి బెల్లంపల్లి శాంతిఖని మైన్ ఓల్డ్ %జూరా% మైసమ్మ తల్లి ఆలయంలో జాదవ్ కిస్టు నాయక్ ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవములు జరుపుతున్నారు.కావున అధిక సంఖ్యలో సెక్యూరిటీ గార్డ్స్ అమ్మవారి దర్శనం చేసుకొని నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా చేయవలసిందిగా కోరారు..

## వర్కింగ్ జర్నలిస్టుల కమిటీ ఎన్నిక



వాయిస్ టుడే ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 ): మంగపేట మండల వర్కింగ్ జర్నలిస్ట్ ల కమిటీ ఎన్నిక గౌరవ అధ్యక్షులు జానపట్ల జయరాజ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. వర్కింగ్ జర్నలిస్టు కమిటీ సభ్యులందరూ భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించుకుని ప్రస్తుతం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాట్లాడడం జరిగింది. ఈ సమావేశం లో అధ్యక్షులు గా కటుకూరి సాంబశివరావు,ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చెట్టుపల్లి స్నేహకుమార్ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు సాంబశివరావు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్ట్ ల సమస్యల పై కృషి చేస్తానన్నారు ఈ సమావేశం లో పాత్రికేయులు గడ్డం ప్రశాంత్ ,ఉగ్గుమల్ల గణేష్,అజారుద్దీన్ ఈసంపల్లి సురేందర్,మైప శంకర్,బోడ ప్రవీణ్, పోలూరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం యువకుడు మృతి

మందమర్రి అక్టోబర్ మూడు ( వాయిస్ టుడే): మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో అంగడి బజార్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన రాజేష్ (20) తన స్నేహితుడు నాగరాజ్ తో కలిసి పనిమీద తాండూర్ మండలం బోయినపల్లి వెళ్లి ఇంటికి వెళుతున్న క్రమంలో మందమర్రి అంగడి బజార్ సర్వీస్ రోడ్ లో రాజేష్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి ఆటో ఢీకొట్టడం వల్ల వెనుక కూర్చున్న రాజేష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే అతని ని చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ,అక్కడి నుండి మంచిర్యాలకి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి తండ్రి పోషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందమర్రి ఎస్.ఐ రాజశేఖర్ తెలిపారు.



## మాజీ ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని వినతి


మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి అక్టోబర్ 3 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి మాజీ శాసన సభ్యులు దుర్గం చిన్నయ్య పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆరిజిన్ డైరీ సి ఏ ఓ బోడపాటి షేజల్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కి గురువారం వినతి పత్రం అందజేశారు. మంచిర్యాల లోని ఎమ్మెల్యే స్వగృహం లో ఆయన ను కలిసి బెల్లంపల్లి నియోజకవర్గం, కన్నాల శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని చిన్నయ్య తన భూమిగా నమ్మబలికి ఆరిజిన్ డైరీ సంస్థ కి అమ్మారు అని ఆమె అన్నారు. కోటి రూపాయలకు 3.07 ఎకరాలు భూమిని సంస్థ కు రిజిస్ట్రేషన్ చేస్తానని తమ వద్ద 30 లక్షలు రూపాయలు తీసుకున్నారని, రిజిస్ట్రేషన్ చేయమని అడుగగా, రిజిస్ట్రేషన్ చేయకుండా ఆరిజిన్ డైరీ మీద తప్పుడు కేసులు పెట్టించారని అన్నారు. ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన అప్పటి బీ ఆర్ ఎస్ ప్రభుత్వం పట్టించోకోలేదని, కనీసం ఇప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలనీ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను కోరారు. ఆమె వెంట సంస్థ ఎం డి కందిమల్ల ఆదినారాయణ, ఉద్యోగులు ఆళ్ల వంశీ కృష్ణ, రేఖా ప్రియదర్శిని తదితరులు ఉన్నారు.

## పీజీ సీట్ల వెబ్ ఆప్షన్స్ కు అక్టోబర్ 4 తుది గడువు



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి అక్టోబర్ 3 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే కాకతీయ యూనివర్సిటీ పీజీ రెగ్యులర్ కోర్సుల కోసం రెండవ విడతలో భాగంగా అక్టోబర్ 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవడానికి గడువు అని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, పీజీ కోఆర్డినేటర్ మేడ తిరుపతి తెలిపారు. ఇక్కడ ఎంఏ పొలిటికల్ సైన్స్ తో పాటు ఎంఏ ఇంగ్లీష్, ఎం.కామ్ కోర్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను సిపి గెట్ పిజి ఎంట్రన్స్ పరీక్షను రాసిన విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. మొదటి విడత పీజీ అడ్మిషన్లలో ఇతర పీజీ కళాశాలల్లో చేరిన విద్యార్థులు సైతం రెండవ విడత బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడానికి వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని చెప్పారు. వివరాలకు ఈ ఫోన్ నెంబర్లలో 9959269975, 9948075400, 9959539369, 7780418194 సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ సూచించారు.

## నూతన షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి అక్టోబర్ 3 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి మున్సిపాలిటీ బజార్ ఏరియాలో లోని శుభం ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన షాపింగ్ మాల్ నీ ప్రారంభించిన బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

## వాసవి మాత ఆలయంలో ఘనంగా ప్రారంభమైన దసరా నవరాత్రి ఉత్సవాలు



మక్తల్ అక్టోబర్ 03 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మాత బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు, ఉదయం గణపతి ప్రార్ధన స్వస్తి పుణ్యా వచనము ధ్వజారోహణము కంకణ ధారణ నవకలశ స్థాపన, సాయంత్రం బతుకమ్మ, ఆటపాటలతో , దండియా నృత్యాలతో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి, ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కోరికలు తీర్చుకుంటున్నారు,కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నామని, ఈ సంవత్సరం కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని, కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా అమ్మవారు కొలువై ఉన్నారని, అమ్మవారి గుడి స్థాపన సమయంలో చిన్న జీయర్ స్వామి వారు సాక్షాత్తు అమ్మవారి ఇక్కడ వచ్చి కొలువై ఉన్నారని ఈ క్షేత్రం ఎంతో పవిత్రమైనదని ఇక్కడ ఏదైనా కోరిక కోరుకుంటే కచ్చితంగా నెరవేరుతుందని స్వామివారు చెప్పారు,సాయంత్రం అమ్మవారు అశ్వవాహనం పై దర్శనమిచ్చారు, మొదటి రోజు చిన్నారులు, మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయినారు, అనంతరం వచ్చిన భక్తులకు అల్పాహారం వితరణ చేశారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, పట్టణ ప్రజలు, భక్తులు,చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప డిగ్రీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




మక్తల్ అక్టోబర్ 3 3 వాయిస్ టుడే ప్రతినిధి: మఖ్తల్ పట్టణంలోని అయ్యప్ప డిగ్రీ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టా అందించారు. అనంతరం విద్యార్థులు వేడుకలు చేసుకున్నారు. ఆ తర్వాత నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయి కి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, హరిప్రసాద్, అనంత్ రెడ్డి, గోవర్ధన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు. యాదగిరిగుట్ట పరిధిలోని శ్రీరామ్ నగర్ చౌరస్తాలో అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేసి మొదటి రోజు శ్రీ దేవీ స్వర్ణకవచ దారి అలాంకరణ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు..విగ్రహ దాత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దంపతులు కలిసి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మాలధారణ చేసి లలిత సహస్ర నామాలతో దేవిని సేవించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు..

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి అక్టోబర్ 3 2024 (వాయిస్ టుడే) : కన్నపెల్లి మండల కేంద్రంలో 1 కోటి .40 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ హరీష్ రాజు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

